ఈనాడు
హైదరాబాద్
HMDA

సోమవారం 28 ఆగస్టు 2017 | 24 పేజీలు

మియాపూర్‌లోని శ్రీకృష్ణదేవరాయ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంటులో వరద నీటిలోనే ఉన్న కారును తాడు కట్టి బయటకు లాగుతున్న స్థానికులు



చిక్కు.. చిక్కు..

- వరద బాధిత ప్రాంతాల్లో ఇంకా కొలిక్కిరాని పరిస్థితులు
- మళ్లీ మొదలైన వానలతో బెంబేలెత్తుతున్న నగర జనం
- రాబోయే 48 గంటల్లో భారీగా కురిసే అవకాశం

ఈనాడు, హైదరాబాద్

రెండు రోజులుగా కురిసిన వర్ష బీభత్సం నుంచి నగరవాసి కోలుకోలేదు... జలమయమైన బస్తీలు, పలు నివాసిత ప్రాంతాలు ఇంకా తేరుకోలేదు... వరద నీటి ధాటికి దెబ్బతిన్న రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు... ఈ పరిస్థితుల్లో ఆదివారం ముసురుకున్న దట్టమైన మేఘాలు నగరవాసుల్ని మరింతగా వణికించాయి. శివార్లలో కురిసిన జోరు వాన నగరాన్ని ముంచెత్తుతుందేమోనని భయం గుప్పిట్లో గడిపారు. కొన్నిచోట్ల చినుకు తన ప్రతాపాన్ని చూపింది. రానున్న 48 గంటల పాటు జోరుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించడంతో... ఎలాంటి ముప్పు పొంచి ఉందోనని ఆందోళనకు గురయ్యారు.

● చిన్నపాటి వర్షం కురిస్తే చాలు.. హైదరాబాద్ పరిస్థితి దారుణంగా తయారవుతోంది.. నాలుగైదు సెంటి మీటర్లు కురిస్తే.. వేలాదిమంది నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తోంది. వందలాది కాలనీలు నీట మునిగిపోతున్నాయి. జన జీవనం స్తంభించిపోతుంది. శుక్రవారం ఇదే జరిగింది. కుండ పోతతో నాలాలు, డ్రెయినేజీలు పొంగి పొర్లి.. వందకు పైగా కాలనీలు నీట మునిగాయి. చందానగర్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ, దీప్తిశ్రీనగర్, కృష్ణదేవరాయ నగర్, ఆదర్శనగర్, శాంతినగర్, సీబీఆర్ ఎస్టేట్స్, దుర్గా ఎస్టేట్స్‌లోని పలు అపార్ట్‌మెంట్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, కోదండరామనగర్, ఈస్ట్ ఆనందబాగ్, ఎంజే కూడలి, మల్కాజిగిరి, షిర్డినగర్ కాలనీ, మాదాపూర్, మణికొండ, మియాపూర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లు, కాలనీలు చిన్నపాటి గోదారులను తలపించాయి. ఇలా ...మిగతా 2లో



దీప్తిశ్రీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంటు సెల్లార్‌లో కారు మునిగి పోవడంతో దానిని గుర్తించేందుకు పీకల్లోతు నీటిలో ఓ యజమాని అవస్థ



ఆహార్యం ఆహా అనేలా ఉంది... వయ్యారం వహ్వా అనిపించింది. ఆదివారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పలువురు భామలు పాల్గొన్నారు. వర్ణరంజితమైన వస్త్రాల్ని ధరించి హొయలు పోయారు.



నిమజ్జన వ్యర్థాలపై...
మహా నజర్

- తొలగించేందుకు హెచ్ఎండీఏ కార్యాచరణ
- సాగర్ వద్ద 1,500 మంది కూలీలు.. యంత్రాలు

ఈనాడు, హైదరాబాద్

వినాయక నిమజ్జనానికి ముందే హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) అప్రమత్తమయింది.. హుస్సేన్‌సాగర్‌పై దృష్టి పెట్టింది. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాట్లు చేశారు. వందలాది మంది కూలీలు, అత్యాధునిక యంత్రాల సాయంతో మూడో రోజు నుంచే రంగంలోకి దిగి పని షురూ చేశారు. చవితి ఉత్సవాల్లో ముఖ్యమైన నిమజ్జన ఘట్టం ఎక్కువగా సందడి హుస్సేన్‌సాగర్ వద్దే ఉంటుంది. ఖైరతాబాద్ మహా గణపతి మొదలు బాలాపూర్ గణనాథుడు సహా సుమారు 50 వేలకు పైగా విగ్రహాలను ఇక్కడే నిమజ్జనం చేస్తారు. వ్యర్థాలు సాగర్‌లో పేరుకుంటాయి. హుస్సేన్‌సాగర్ ఇప్పుడిప్పుడే కాలుష్య కోరల్లో నుంచి బయట పడుతోంది. ఈ నేపథ్యంలోనే హెచ్ఎండీఏ చర్యలు తీసుకుంటోంది.

సంవత్సరం	తొలగించిన వ్యర్థాలు (మె.టన్నుల్లో)	వ్యయం (రూ.లక్షల్లో)
2013	3,723	16.21
2014	3,740	22.00
2015	4,250	25.00
2016	2,181	19.50

మూడో రోజు(ఆదివారం) నుంచే నిమజ్జన సందడి మొదలయింది. వ్యర్థాలను తొలగించే ...మిగతా 2లో



వానమ్మ జడి నుంచి...
గంగమ్మ ఒడికి!

ఈనాడు, హైదరాబాద్

జై.. గణేషా.. జైజై గణేషా అన్న నినాదాలు... కార్లు.. బైకుల్లో తరలివస్తున్న గణేషులు... వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడిలోకి చేర్చేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది... తాజా దృశ్యాలను ఫేస్‌బుక్.. వాట్సాప్‌లలో ఉంచేందుకు నిమజ్జనం చేసేముందు యువకుల సెల్ఫీల ...మిగతా 2లో

ఇష్టంలేక పోతే... సైగలెందుకు చేశావ్?



- ప్రేమించావు... ఇప్పుడు కాదంటున్నావు
- ఐదు నిమిషాలకో మెయిల్... పది నిమిషాలకో ఫోన్‌కాల్
- బ్యాంకు ఉద్యోగినికి యువ ఇంజినీర్ తీవ్ర వేధింపులు

ఈనాడు, హైదరాబాద్

‘ఇద్దరం కలిసి ఏడాదిపాటు ఒకర్నొకరు చూసుకున్నాం... బస్‌స్టాప్‌లో రోజూ కలిసేవాళ్లం.. చూసినప్పుడు నవ్వేదానివి. బస్సులో దిగేప్పుడు బాయ్.. అంటూ చేతులు ఊపేదానివి... నాకు మీతో మాట్లాడాలంటే భయం.. మీరు చైన్నె నుంచి వెళ్లిపోయాక నాకు పిచ్చిపట్టింది... ఎలాగైనా మిమ్మల్ని కలుసుకోవాలన్న లక్ష్యంతో మీ స్నేహితురాలి నుంచి ఈ-మెయిల్ తీసుకున్నా. అప్పటి నుంచి మీకు మెయిల్స్ పంపుతున్నా స్పందించడం లేదు... ఫోన్‌చేస్తే నాకు ప్రేమలేదు అంటారు... ఎందుకిలా చేస్తున్నారు... మీపై ప్రేమ... మిమ్మల్ని కలుసుకోవాలన్న ధ్యాసతో హైదరాబాద్‌లో ఐఈఎస్ కోచింగ్ క్లాసులకు వెళ్తున్నా బుర్రకెక్కడం లేదు... మిమ్మల్ని పెళ్లిచేసుకోవాలన్న లక్ష్యంతో దేశ దిమ్మరిలా తిరుగుతున్నాను. ఇప్పటికైనా మించి పోయింది లేదు... నన్ను ప్రేమించండి.. లేదా మీరు నన్ను చూసి నవ్వలేదు... సైగలు చేయలేదు అంటూ గుండెల మీద చెయ్యేసుకుని చెప్పండి.. నిజం చెబితే మిమ్మల్ని వదిలేస్తా’

- హైదరాబాద్‌లోని ఓ జాతీయ బ్యాంకులో అధికారిగా పనిచేస్తున్న యువతితో పోకిరీ యువ ఇంజినీర్ అన్నమాటలివి. అనుక్షణం అతడి వేధింపులు తాళలేక బ్యాంకు అధికారి ‘షి’ బృందం సభ్యులను ఆశ్రయించగా... పోలీస్ అధికారులు ఇంజినీర్‌ను రెండురోజుల క్రితం రప్పించారు. తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ముందు మొండికేసినా.. పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించగానే, ఇకపై బ్యాంకు అధికారిని వేధించబోనంటూ లిఖితపూర్వకంగా అంగీకరించాడు. మరోవైపు ఆ ఇంజినీర్‌ను తాను ఏమాత్రం గమనించలేదని, చెన్నైలో ఉన్న ఏడాది కాలంలో ఒక్కసారీ మాట్లాడలేదని బాధితురాలు పోలీసులకు వివరించారు.

అండమాన్ నికోబార్ అబ్బాయి.. బెంగాలీ అమ్మాయి

పశ్చిమబంగ రాష్ట్రానికి చెందిన సారిక(పోలీసులు పేరు మార్చారు) ఇంజినీరింగ్ పూర్తి చేశాక చెన్నై లోని ఓ జాతీయ బ్యాంకులో ఐటీ విభాగంలో అధికారిగా ఏడాదిన్నర క్రితం ఉద్యోగం వచ్చింది. ఆమె ఒంటరిగా వచ్చి థౌజండ్‌లైట్స్ సమీపంలోని ఓ మహిళా వసతిగృహంలో ఉంటున్నారు. ఆ వసతి గృహం ఎదురుగా అండమాన్ నికోబార్‌కు చెందిన రామన్ ఉంటున్నాడు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన రామన్ ఉద్యోగావకాశాల కోసం వచ్చాడు. బ్యాంకులో పని చేస్తున్న యువతి తన స్నేహితులతో కలిసి బస్‌స్టాప్ వద్దకు వచ్చి బస్సులో బ్యాంకుకు వెళ్తుండేది. రామన్ అదేబస్సులో వెళ్తుండేవాడు. సాయంత్రం దాదాపుగా ఇద్దరు ఒకే సమయంలో తిరిగి వచ్చేవారు. రెండు నెలల తర్వాత రామన్ సదరు యువతి తనను గమనిస్తోందని, ఇష్టంగా చూస్తోందని భ్రమపడ్డాడు. బస్సులో వెళ్తున్నప్పుడు ఆమె సీటు వెనుకే కూర్చునేవాడు. అప్పుడప్పుడూ ఆమె పక్కనున్న స్నేహితురాలిని చూసి చిరునవ్వు నవ్వేవాడు. బ్యాంకు అధికారి రామన్‌ను బస్సులో ప్రయాణికుడిగానే చూస్తుండేది. బస్‌స్టాప్‌లో దిగిపోయే హాస్టల్‌మేట్స్‌ను చూస్తూ చేతులూపేది. ఇలా చేతులూపడం తన కోసమేనని రామన్ అనుకున్నాడు. తనను ఆమె గాఢంగా ప్రేమిస్తోందని గట్టిగా అనుకుని పెళ్లిచేసుకుందామని అడిగేందుకు నిర్ణయించుకున్నాడు. ఆరునెలల క్రితం ఆమెకు ఒడిశాకు బదిలీ అయ్యింది. పెళ్లి విషయం అడిగేందుకు బస్సు ఎక్కిన రామన్‌కు ఆమె కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యాడు. ఆమె స్నేహితురాలిని అడగ్గా... బదిలీ అయ్యిందంటూ వివరించింది. ఆమె చిరునామా, ఫోన్ నంబరు ఇవ్వాలని కోరగా.. ఈ-మెయిల్ చిరునామా మాత్రం ఇచ్చింది. ఇక అప్పటి నుంచి రామన్ ఆమెకు రోజూ మెయిల్స్ పంపుతున్నాడు.

సిమ్‌లు మారుస్తూ...

మెయిల్ చిరునామా ఆధారంగా రామన్ ఆమె ఫోన్ నంబరు కనుగొన్నాడు. ఈలోపు అతడికి సైట్ ఇంజినీర్‌గా ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం లభించింది. విధి నిర్వహణలో భాగంగా దేశంలోని వేర్వేరు నగరాలు, పట్టణాలకు వెళ్లేవాడు. అక్కడి వెళ్లినప్పుడు ఆయా రాష్ట్రాల సిమ్‌కార్డులను తీసుకుని బ్యాంకు అధికారికి వెంటవెంటనే ఫోన్లు చేసేవాడు. మిమ్మల్ని ప్రేమిస్తున్నానని, మీరంటే చాలా ఇష్టం అంటూ చెప్పేవాడు. ఆమె ఆ ఫోన్ నంబరును బ్లాక్ చేయగా... వేరే సిమ్‌తో ఫోన్ చేసేవాడు. ఇలా నలభై సిమ్‌కార్డులను ఉపయోగించి ఐదు నిమిషాలకోమారు ఫోన్, పది నిమిషాలకోసారి ఈ-మెయిల్ చేసేవాడు. ప్రతి ఫోన్, మెయిల్ సారాంశం ప్రేమించుకుందాం.. పెళ్లిచేసుకుందాం అన్నదే. ఒక్కోసారి ఫోన్‌చేసి మీ బ్యాంకు సమీపంలోనే ఉన్నాను.. పది నిమిషాల్లో వస్తానంటూ బెదిరించేవాడు. ఆమె భయపడి ఒక్కోసారి ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తుండేది. బ్యాంకు అధికారులకు ఈ విషయాన్ని వివరించడంతో సానుభూతితో ఆమెను మూడునెలల క్రితం హైదరాబాద్‌కు బదిలీ చేశారు. బదిలీచేసే ముందు అతడితో మాట్లాడాలంటూ ధైర్యం చెప్పి మాట్లాడించారు. తనకు పెళ్లి నిశ్చయమైందని, ఎప్పుడూ తనను చూడలేదంటూ ఫోన్‌లో ఆమె రామన్‌కు చెప్పింది. అప్పటికి సరేనన్న రామన్... ఆమె హైదరాబాద్‌కు వెళ్లిందన్న విషయాన్ని తన సాంకేతిక నైపుణ్యంతో గ్రహించాడు. నెలరోజుల క్రితం నేరుగా హైదరాబాద్‌కు వచ్చి ఆమెకు ఫోన్ చేశాడు. ఆమె తాను పశ్చిమబంగలో ఉన్నానని, కొద్దిరోజుల తర్వాత వస్తానంటూ చెప్పింది. బ్యాంకులో తన స్నేహితులకు బాధితురాలు ఈ సమస్యను వివరించగా.. ‘షి’ బృందాలకు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. ఆమె తన ఆవేదనంతా పోలీసుకు వివరించింది. పోలీసులు రామన్‌ను పట్టుకునేందుకు బ్యాంకు అధికారి సహోద్యోగితో ఫోన్ చేయించి రప్పించారు. బాధితురాలినీ ‘షి’ కార్యాలయానికి పిలిపించి ముఖాముఖి నిర్వహించారు. మరోసారి బ్యాంకు యువతికి జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు. అండమాన్ నికోబార్‌లో ఉంటున్న రామన్ తల్లిదండ్రులకు విషయం వివరించారు. మరోసారి ఇలా చేస్తే జైల్లో పెడతామంటూ వారికి తెలిపారు.

అత్తింటివారి వేధింపులకు వివాహిత ఆత్మహత్య



అనురాధ(పాతచిత్రం)

కాప్రా, న్యూస్‌టుడే: పెళ్లయి ఎనిదేళ్లయింది. పిల్లలు కలగలేదు. పైగా అత్తింటివారి ఆరళ్లకు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై అశోక్‌కుమార్ కథనం ప్రకారం.. కాప్రాలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న గడ్డం క్రిష్ణకు యాదాద్రి జిల్లా బొమ్మలరామారాం మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన అనురాధ (25)తో 2010 జూన్ 6న పెద్దలు వివాహం చేశారు. దంపతులకు ఎనిమిదేళ్లుగా పిల్లలు కలగలేదు. దీంతో భర్త, అత్తింటివారు ఆమెను సూటిపోటి మాటలతో హింసిస్తున్నారు. మనస్తాపం చెందిన అనురాధ మధ్యాహ్నం గదిలో ఫ్యానుకు చీరతో మెడకు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి తల్లి సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామని, అత్తింటివారిపై వేధింపులు, హింస కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

నిమజ్జన వ్యర్థాలపై... మహా నజర్

(మొదటి పేజీ తరువాయి) బాధ్యతను టెండర్ ప్రక్రియ ద్వారా గుత్తేదారుకు హెచ్ఎండీఏ అప్పగించింది. ఈ ప్రక్రియలో 1,500 మంది కూలీలు.. 134 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటారు. జేసీబీలు, టిప్పర్లను ఎన్టీఆర్ మార్గ్‌లోని ఒకటి నుంచి ఎనిమిది నిమజ్జన వేదికల వద్ద మోహరించనున్నారు. ఇవేకాకుండా అత్యాధునిక యంత్రాలైన లాంగ్ బూమ్ ఎక్స్‌వేటర్, ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ కమ్ స్కిమ్మర్, ఫ్లోటింగ్ బార్జ్ మౌంటెడ్ ఆపరేటర్లతో ఎప్పటికప్పుడు తొలగించనున్నారు. ఎక్స్‌వేటర్ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వ్యర్థాలతో పాటు ఇనుము తదితరాలను ఒడ్డుకు చేరుస్తాయి. ఇక ట్రాష్ కలెక్టర్ పూజ సామగ్రి, నీటిపై తేలియాడే వ్యర్థాల పని పడుతుంది. ఒడ్డుకు చేర్చిన వ్యర్థాలను జేసీబీలు టిప్పర్లలోకి చేరుస్తాయి. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉన్న జీహెచ్ఎంసీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు.. అక్కడి నుంచి జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా వీలైనంత తొందరగా పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. పదకొండో రోజు తర్వాత పనుల్ని మరింత వేగిరం చేయనున్నారు.

తగ్గొచ్చు... గతంతో పోలిస్తే వ్యర్థాల పరిమాణం తగ్గే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరవాసుల్లో పర్యావరణంపై అవగాహన పెరిగింది. చాలా చోట్ల మట్టి గణపతుల్ని ప్రతిష్ఠించారు. ఎత్తులో పరిమితుల్ని పాటించారు. ట్యాంక్ బండ్‌పై కాకుండా స్థానికంగా ఉండే చెరువులు, కుంటల్లోనే నిమజ్జనం చేసే అవకాశముందని భావిస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రత్యేక నిమజ్జన కోనేరులను సిద్ధం చేసింది. గతంలోనూ 4 వేల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు వెలువడే అవకాశముందని అధికారులు అంచనా వేసి.. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. చివరి రోజు వరకు 2,181 మెట్రిక్ టన్నులే తొలగించారు. ఈసారి ఆ పరిమాణం ఇంకా తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

బిక్కు... బిక్కు!

(మొదటి పేజీ తరువాయి) జల దిగ్బంధంలో చిక్కుకున్న కాలనీలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి.. అపార్ట్‌మెంట్ సెల్లార్లు, రహదారులపై చేరుకున్న నీరు తగ్గుముఖం పట్టింది. అటు జీహెచ్ఎంసీ.. ఇటు ఇతర ప్రభుత్వ యంత్రాంగాలు సహాయక చర్యలు చేపట్టారు. నగర శివారు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నగరాన్ని దట్టమైన మేఘాలు కమ్మేశాయి. దీంతో కుండపోత వర్షం ఖాయమని అందరూ భావించారు. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీవాసులైతే ఏం జరుగుతోందనని ఆందోళనకు గురయ్యారు. కూకట్‌పల్లి ధరణీకాలనీ వాసులు ఇంకా భయాందోళనలోనే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. కంటోన్మెంట్, లాలా పేట్, తార్నాక, నేరెడ్‌మెట్, సికింద్రాబాద్, ఏఎస్‌రావు నగర్, కాప్రా, కుషాయిగూడ, సైనిక్‌పురి, నాగారం, అడ్డగుట్ట, తుకారాం గేట్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం జోరుగా వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయం కావడంతో వాహనదారులకు నరకం కనిపించింది. రెండురోజుల పాటు కురిసిన వర్షాలకు మదీనాగూడలోని సత్యనారాయణ ఎన్‌క్లేవ్ బేస్‌మెంట్ దెబ్బతినడంతో... ముందు జాగ్రత్తగా జీహెచ్ఎంసీ అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించింది. ఇటు రాబోయే 48 గంటల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

వానమ్మ జడి నుంచి... గంగమ్మ ఒడికి!

(మొదటి పేజీ తరువాయి) కోలాహలం... వెరసి ఆదివారమంతా హుస్సేన్‌సాగర తీరమంతా సందడి నెలకొంది. గణేష్ ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వందల సంఖ్యలో భక్తజనం హుస్సేన్‌సాగర్‌కు చేరుకున్నారు. కార్లు, బైకుల్లో వినాయక విగ్రహాలను తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ 1,500 విగ్రహాలు నిమజ్జనం అయ్యుంటాయని పోలీసులు అంచనా వేశారు. వాహనాల రద్దీ ఏర్పడకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. సెలవురోజు కావడంతో ఖైరతాబాద్ గణేష్‌ను సందర్శించేందుకు వేల మంది భక్తులు, యువతులు, మహిళలు నగరం నలుమూలల నుంచి వచ్చారు. ఒక్కసారిగా జనం పోటెత్తడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. సాయంకాలం నుంచి వర్షం మొదలవ్వడంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మధ్యమండలం డీసీపీ జోయల్ డేవిస్ స్వయంగా భద్రతను పర్యవేక్షించారు. అనూహ్యంగా భక్తులు సందర్శనకు రావడం, ఒక్కసారిగా రహదారులపై వాహనాలు పెరగడంతో ఖైరతాబాద్ నుంచి లక్డీకాపూల్ వరకూ ట్రాఫిక్ స్తంభించింది. భద్రతాచర్యలో భాగంగా ఎత్తైన భవనాలు, అపార్ట్‌మెంట్లపై భక్తులను అనుమతించ లేదు.

వదినను హత్య చేసిన మరిది

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: వదినతో సహజీవనం చేస్తున్న ఓ ప్రబుద్ధుడు వంట చేయలేదనే కోపంతో ఆమె తలపై ఫ్యాన్ గడ్డతో మోది హత్య చేసిన సంఘటన ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌సాబ్ కుంటకు చెందిన రహీమున్నీసా(33) భర్త ఇసాముద్దీన్‌ను వదిలేసి గత ఆరు నెలలుగా మరిది ఖయూముద్దీన్‌తో సహజీవనం చేస్తోంది. శనివారం అర్ధరాత్రి ఇంటికి వచ్చిన ఖయూముద్దీన్ వంట చేయలేదని రహీమున్నీసాతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఖయూముద్దీన్ కోపంతో ఇంట్లో చెడిపోయి ఉన్న రెక్కలు లేని ఫ్యాన్ గడ్డను తీసుకుని రహీమున్నీసా తలపై మోదాడు. రహీమున్నీసా తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. రహీమున్నీసా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఫలక్‌నుమా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై మరమ్మతులు..వాహనదారుల కష్టాలు

కూకట్‌పల్లిలో నిరంతరం అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారి మధ్యలో ఆర్టీసీ బస్సును నిలిపి డ్రైవర్, కండక్టర్ మరమ్మతులు చేశారు. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్సు వెనుక భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

నగరంలో ఈనాడు

- కింగ్ కోఠిలోని భారతీయ విద్యా భవన్స్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ‘అన్నమయ్య శ్రీకృష్ణ తత్వం’ సాంస్కృతిక కార్యక్రమం
- రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు ‘శ్రీరామానుజ వైభవం - కొయ్య, తోలు బొమ్మలాట’ ప్రదర్శన
- బేగంపేటలోని చిన్మయ ధ్యాన నిలయంలో సాయంత్రం 6.30 గంటలకు ‘కూల్ హ్యాపీనెస్’ అనే అంశంపై స్వామి చిదాత్మనంద ప్రసంగం

కళాంజలిలో సరికొత్త డిజైన్లు



ఈనాడు, హైదరాబాద్

కళాంజలిలో వృషభ కలెక్షన్స్‌లో సరికొత్త డిజైన్లు వచ్చాయి. సంప్రదాయానికి ఆధునిక మేళవింపుతో రూపొందించిన కాటన్ హ్యాండ్‌ప్రింట్ వస్త్రాలు ఏ సందర్భంలోనైనా మగువలు ధరించేందుకు అనువుగా ఉన్నాయి.

ముదురు నీలం రంగు చీర.. నారింజ రంగు అంచు.. చీర అంతటా వృషభాల మోటిఫ్స్‌తో పాటూ పల్లుతో మరింత అందం వచ్చింది.

బ్లాక్ ప్రింటెడ్ డిజైనర్ నీలం రంగు సికో చీర వృషభాల మోటిఫ్స్‌తో చూడచక్కగా ఉంది.

అదే ఉల్లాసం









గచ్చిబౌలి స్టేడియం వద్ద ఆదివారం ఉదయం ఫిజికల్ లిటరసీ డేస్ కార్యక్రమం స్పోర్ట్స్ ఫెస్టివల్ థీమ్‌తో ఉల్లాసభరితంగా సాగింది. యువతీయువకులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలకు కట్టుకొని వినూత్నంగా క్రికెట్ ఆడారు. పలువురు నృత్యంతో ఆకట్టుకున్నారు. – న్యూస్‌టుడే, గచ్చిబౌలి

ఫ్యాషన్ పరవశం



ఒక పక్క వాన చినుకులు.. మరో పక్క ఫ్యాషన్ మెరుపులు.. మొత్తానికి అందాల వానలో.. అతిథులు తడిసిపోయారు. బంజారాహిల్స్ రోడ్డు నం.8లో నూతనగా ఏర్పాటుచేసిన ఓ స్టూడియోను ఆదివారం ప్రారంభించారు. సినీనటులు శ్రీనాథ్ మాగంటి, పూజశ్రీ, సోనీ ఈ స్టోర్ ప్రారంభించారు. పలువురు మోడల్స్‌తో ఫ్యాషన్ ప్రదర్శన నిర్వహించారు.

– న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మిస్, మిస్టర్ ఇండియా ఆడిషన్స్ సందడి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: వీబీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో మిస్టర్, మిస్ ఇండియా 2017-18 ఆడిషన్స్ ఆదివారం సికింద్రాబాద్ యునైటెడ్ 21 హోటల్‌లో సందడిగా సాగాయి. అధిక సంఖ్యలో మోడల్స్ తరలివచ్చి ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేసి అలరించారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు ఆధునిక వస్త్రధారణల్లో ఆకట్టుకొన్నారు. ఈ సందర్భంగా డైరక్టర్ విజయ్ బానోతు, సంస్థ ఛైర్మన్ బానోతు శివకుమార్ మాట్లాడుతూ.. 29 రాష్ట్రాల్లోని 70 పట్టణాల్లో ఈ పోటీలు నిర్వహించి 522 మందిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారితో 2018లో ఎల్‌బీ స్టేడియంలో గ్రాండ్ ఫినాలే నిర్వహించి మిస్టర్, మిస్ ఇండియాలను ఎంపిక చేస్తామన్నారు. ఇటీవల విశాఖపట్టణంలో ఆడిషన్స్ పూర్తి చేశామని వారు వివరించారు.



మిస్టర్ అండ్ మిస్ ఇండియా 2017-18లో పాల్గొన్న మోడల్స్


ఎన్‌ఎండీసీ కాలనీని ముంచెత్తిన వరదనీరు


మల్లికార్జున్‌నగర్‌లో ఏరులై పారుతున్న నీరు


దీన్‌దయాళ్‌నగర్‌లో..

వరుణుడి ప్రతాపంతో లోతట్టు కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. వరసగా కురుస్తున్న వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గం లేక వీధుల్లో నిలవడంతో ఆయా ప్రాంతాల వాసులు అష్టకష్టాలు పడుతున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది.

పది చెరువుల నీరు.. రెండే తూములు!

దశాబ్దాలుగా జనం గోడు పట్టని పాలకులు

శేరిలింగంపల్లి, మియాపూర్, న్యూస్‌టుడే

చినుకుపడితే మియాపూర్, మదీనాగూడ, చందానగర్ ప్రాంతాల్లోని నివాసితులు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. తేలికపాటి వర్షం పడినా జరగబోయే పరిణామాలతో ఆందోళనకు గురవుతున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా దాదాపు 50వేల కుటుంబాల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అవస్థపడుతున్నారు. వరద నీరు ముంచెత్తడం.. సెల్లార్లు, రోడ్లు ఏకం కావడంతో జలదిగ్బంధంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు. కనీసం ఇంటినుంచి కాలు బయటపెట్టే అవకాశం లేకుండా లేని దయనీయ స్థితిలో రోజులపాటు కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి వారిది. కొందరి స్వార్థం.. అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణాలోపంతో చాలా ప్రాంతాల ప్రజలు తమ గోడుని ఎవరికి చెప్పుకోవాలో తెలియక కన్నీటి పర్యంతమవుతున్నారు.

గొలుసు కట్టు చెరువులైన నాయినమ్మ కుంట, రామ సముద్రం కుంట, రేగుల కుంట, గుర్నాధం చెరువు, పటేల్ చెరువు.. మీదకుంట, ఖాయిదమ్మ కుంట, మంగలికుంట, కొత్తకుంట, ఈర్ల చెరువులకి చెందిన వరద నీరు దీప్తిశ్రీనగర్ దగ్గర కలిసి గంగారం పెద్ద చెరువులో కలుస్తుంది. ఈ పది చెరువులకి చెందిన వరద నీరు వెళ్లడానికి నాలా విస్తీర్ణం కనీసం 40 అడుగలపైన ఉంటేనే సజావుగా వెళ్లడానికి ఆస్కారం ఉంటుంది. గంగారం - దీప్తిశ్రీనగర్ మధ్య పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డుకిందగా అమర్చిన రెండు తూములగుండానే పది చెరువుల నీరు వెళ్లేలా ఉంచారు. ఈ రెండే తూముల గుండా వెళ్లలేక వరద వెనిక్కి తన్నడంతో కాలనీలు, అపార్టుమెంట్లు మునిగిపోతున్నాయి. వీటిని తొలగించి నాలాలని విస్తరించి విశాలకల్వర్టు నిర్మాణం చేయాలని చాలా సంవత్సరాలుగా ఈ ప్రాంతంవాసులు కోరుతున్నారు.

వచ్చారు.. వెళ్లారు..

గత ఏడాది వర్షాకాలంలో ముంపునకు గురైన సమయంలో నగర మేయర్ బొంతురామ్మోహన్‌తో పాటు ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. సమస్యని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది జులైలో గ్రేటర్ కమిషనర్, మేయర్, గ్రేటర్ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే దీప్తిశ్రీనగర్, సీబీఆర్ ఎస్టేట్ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొద్దినెలల కిందట మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో చెరువులు, నాలాల ఆక్రమణలపై తొలగింపునకు యంత్రాంగం ముందుకు వచ్చింది. తీవ్ర ప్రభావం ఉన్న మియాపూర్ ప్రాంతంలో అరకొరగా చర్యలు తీసుకున్నారు. అప్పట్లో రెవెన్యూ, జీహెచ్ఎంసీ, నీటి పారుదల, పోలీసు తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఏర్పాటుచేశారు. అదే సమయంలో దీప్తిశ్రీనగర్ నాలాని ఆక్రమించిన ప్రదేశాలు గుర్తించారు. చర్యలు మాత్రం లేవు.


పది చెరువుల నీరు.. ఈ రెండు తూములు గుండా వెళ్లాల్సిందే..

జనం కన్నీటిపర్యంతం...

వర్షాకాలం ముంపు ప్రాంత బాధిత వేదన, ఆవేదన వర్ణనాతీతం. శుక్రవారం రాత్రి రెండుగంటల భారీ వర్షానికే మదీనాగూడలోని కృష్ణదేవరాయనగర్, రామకృష్ణనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్‌లో సెల్లార్లు, పార్కింగ్‌లో ఉన్న 30కార్లు, 100 వరకు ద్విచక్ర వాహనాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో వాహనదారుల వేదన ఒక్కోరకంగా ఉంది. సెల్లార్లలోకి నీళ్లు చేరి మీటర్లు పూర్తిగా తడిచిపోయి, లిఫ్టులు వరద నీటితో నిండిపోవడంతో పాటు 10అడుగుల నీరు నిలిచి జనం బయటకి రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలో కరెంటు పూర్తిగా లేక అంధకారంలో జీవిస్తున్నారు. 10అడుగుల మేర నీరు నిలవడంతో కనీసం మెట్లమీద నుంచైనా బయటకి రాలేని పరిస్థితిలో వేలాది మంది కొట్టుమిట్టాడుతున్నారు. పాల ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులు, అనారోగ్యంతో అల్లాడుతున్న వారు కనీసం మందులు తెచ్చుకోవడానికి వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఉంది. రెండురోజులు వర్షపు నీరు నిల్వఉండటంతో పేరుకుపోయిన బురదతో కొన్ని ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది.

వరద ముంపు ప్రాంతాల్లో మేయర్ పర్యటన


మియాపూర్‌లో పర్యటిస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ దీప్తిశ్రీనగర్, రామకృష్ణనగర్ ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన నేపథ్యంలో గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాల కారణంగా పొంగుతున్న నాలాలకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పశ్చిమమండలం కమిషనర్ హరిచందన, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా వర్షపు నీటి కారణంగా దీప్తిశ్రీనగర్ ప్రాంతంలోని ఓ సెల్లార్ రిటర్నింగ్ వాల్ కూలిపోవడంతో పక్కనే ఉన్న సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌కి చెందిన సుమారు 80 కుటుంబాల వారిని ఖాళీ చేయించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. నివాసితులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. నాలాలని పూర్తి స్థాయిలో విస్తరించి సమస్యని శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదభరితంగా ఉన్న సెల్లార్ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రినుంచి పోలీస్ భద్రత ఏర్పాటుచేసినట్లు మియాపూర్ ఏసీపీ రవికుమార్, సీఐ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. నాలాల విస్తరణ అనంతరం ఇరువైపులా కాంక్రీట్ గోడ ఏర్పాటు చేయాలని మేయర్ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వెంకన్న, చందానగర్, హఫీజ్‌పేట, మాదాపూర్ కార్పొరేటర్లు నవతారెడ్డి, పూజిత, జగదీశ్వర్‌గౌడ్, మియాపూర్ కార్పొరేటర్ మేకా రమేష్, నీటి పారుదల శాఖ ఏఈ శేషగిరిరావు, జలమండలి మేనేజర్ నాగప్రియ, దీప్తిశ్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.నాగేశ్వర్‌గౌడ్, ఎన్.పూర్ణచందర్‌రావు, యు.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన సెల్లార్ రిటైనింగ్ వాల్

అపార్ట్‌మెంట్‌వాసులను ఖాళీ చేయించిన అధికారులు


ప్రమాదకరంగా మారిన ప్రాంతంలో ఇసుక బస్తాలను ఏర్పాటుచేసిన అధికారులు

మియాపూర్, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా మదీనగూడ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న సెల్లార్ రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. మదీనగూడ దీప్తిశ్రీనగర్ కాలనీ ప్రవేశంపక్కనే ఓ నిర్మాణ సంస్థ భారీ సెల్లార్‌ను తవ్వడంతో శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున సెల్లార్ నీటితో నిండిపోయింది. దీంతో సెల్లార్‌కు పడమరవైపు అతి సమీపంలో ఉన్న సత్యనారాయణ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్ వైపు రిటైనింగ్ వాల్ వర్షపు నీటి ధాటికి పూర్తిగా కుంగిపోయి కూలిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. అపార్ట్‌మెంట్‌లోని రెండు బ్లాక్‌లో నివాసం ఉంటున్న సుమారు 80 కుటుంబాలను పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఖాళీచేయించారు.

అదే నిర్లక్ష్యం.. తప్పని అవస్థలు

కొనసాగుతున్న వరద కష్టాలు

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. నాలాలను శుభ్రంచేసి కాలనీవాసుల ఇబ్బందులను తీర్చాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఆల్విన్‌కాలనీ ఫేజ్-2, ధరణీనగర్ కాలనీ వాసుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. శుక్రవారం రాత్రినుంచి కురుస్తున్న వర్షానికి ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో డీ-1నుంచి డీ-8 వరకు రోడ్డు ఇరువైపులా ఇళ్లలోకి వరద నీరుచేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు ఆల్విన్‌కాలనీ వాసులు ఇళ్లలోకి నీరుచేరడంతో అన్నపానీయాలు మాని ఇంటిబయట కాలం వెళ్లదీస్తున్నారు. శనివారం సాయంత్రానికి కొద్దిగా వర్షం తగ్గడంతో కాలనీవాసులు నీటిని ఇళ్లనుంచి తొలగించుకున్నారు. ఆదివారం సాయంత్రం మళ్లీ వర్షం కురవడంతో వెంకటపాపయ్యనగర్ కాలనీలో మ్యాన్‌హాల్‌లు పొంగి మురుగు, వర్షపునీరు ఆల్విన్‌కాలనీ చివరి బస్‌స్టాపు వద్ద నిలిచి కింద ఉన్న ఆల్విన్‌కాలనీలోకి చేరుతోంది.

ధరణీనగర్‌ను వేధిస్తున్న నురగ సమస్య

ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి పరికి చెరువు అలుగునుంచి వరద పొంగి పొర్లింది. దీంతో వరదనీరు ధరణీనగర్ నాలాలోకి వచ్చే క్రమంలో తీవ్రమైన దుర్వాసన, నురగతో ధరణీనగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరికి చర్మ వ్యాధులు ప్రారంభమయ్యాయి. దురదలు రావడం, రసాయన వాసనలకు శరీరంపై పుండ్లు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చెరువులో రసాయనిక వ్యర్థాలు కలవడంతోనే సమస్య తలెత్తుతోందని పర్యావరణ వేత్తలు చెబుతుంటే అదేంకాదు.. ఇంట్లో వాడే డిటర్జంట్ సోపులు, షాంపులు, ఫాంఆయిల్ నూనెలు తదితరాలు వాడకంతో నురగ వస్తోందని కాలుష్య నియంత్రణ అధికారులు చెప్పడం కాలనీవాసులకు ఆందోళన కలిగిస్తోంది. సబ్బునురగైతే ఘాటు వాసనలు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




ధరణీనగర్‌లోనాలా వద్ద పేరుకు పోతున్న నురగ, నురగ సమస్యతో పుండ్లు ఏర్పడిన బాలుడు


వరసగా కురుస్తున్న వర్షాలతో నగరంలోని రహదారులు అధ్వానంగా మారాయి. ముషీరాబాద్‌లో రాళ్లు తేలిన ప్రమాదకరంగా మారిన మార్గం.



మొండామార్కెట్లో గోతులెక్కడో.. దారి ఎక్కడో తెలియని స్థితి

ఆదివారం మళ్లీ కురిసిన వర్షం నగర జీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. రోడ్డుపైకి వచ్చిన ప్రజలు.. దారి ఎక్కడో.. గోతులెక్కడో తెలియక ఆందోళనతో ముందుకు సాగారు. వాహనాలు వేగంగా వెళ్లలేక పోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఏర్పడింది. గోతులు.. పొంగిన మురుగు కాల్వల వల్ల అష్టకష్టాలతో సెలవుదినాన్ని సరిగా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోయారు.



మొండామార్కెట్ దారి అంతా వాననీరు నిండడంతో జాగ్రత్తగా వెళ్లాల్సిన స్థితి

అష్టకష్టాలకు సెలవెప్పుడో?





సికింద్రాబాద్‌లో, ఆర్టీసీ చౌరస్తాలో.. ద్విచక్రవాహనదారుల కష్టాలు



జగద్గిరిగుట్ట రోడ్డుపై అడుగడుగునా పొంగుతున్న మురుగు



సికింద్రాబాద్ గురుద్వారా వద్ద వరదకు దారి లేక..



సికింద్రాబాద్-బేగంపేట దారిలో కుంగిన రోడ్డు



సికింద్రాబాద్ గురుద్వారా వద్ద పొర్లుతున్న వరద



గోల్కొండ చౌరస్తాలో శిథిలమైన దారి



సికింద్రాబాద్ గురుద్వారా వద్ద నిలిచిపోయిన బస్సుల ట్రాఫిక్



ఎన్టీఆర్ చౌరస్తాలో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు



జగద్గిరిగుట్టలో మురుగు నిలిచి ఉన్నా పట్టని స్థితి



ఇసుక మేటలు వేసిన ఆర్టీసీ కూడలిలో అవస్థలు

రాజేంద్రనగర్

డయల్ యువర్ డీఎం నేడు

మెహిదీపట్నం: మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలను ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. చరవాణి నం. 99592 26133లో సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ భూతం..

● నిబంధనలు మీరుతున్నా కానరాని చర్యలు

పట్టని యంత్రాంగం

కాటేదాన్, న్యూస్‌టుడే: రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలుగుతుంది. ప్లాస్టిక్ ఉత్పత్తి పరిశ్రమలతో పాటు ప్రధానంగా తక్కువ మందంగల ప్లాస్టిక్ సంచులే వాడుతున్న కిరాణా దుకాణాలు, బేకరీలు, హోటళ్లపై అధికారులు తగిన దృష్టిసారించడంలేదు. ఏడాదికో రెండేళ్లకో ఒక్కరోజు తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచుల వాడకం పెనుభూతంలా మారింది. గ్రామీణమైనా... నగర పరిధి అయినా వాడకం విచ్చలవిడిగా పెరిగింది. ప్రధానంగా కాటేదాన్ పారిశ్రామికవాడలో 800కు పైగా ప్లాస్టిక్ పరిశ్రమలున్నాయి. అన్నింటిలో తక్కువ మందంగల సంచుల ఉత్పత్తి జరుగుతుంది. నాలుగురోజుల క్రితం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎస్‌ఓటీ పోలీసులు వెంటనే స్పందించి దాడులు చేశారు. ఇదే రీతిలో రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు కొరడా విదిలిస్తే మరిన్ని ఫలితాలు రావచ్చు. కాగా 40 మైక్రాన్‌లకంటే తక్కువ మందంగల సంచులు వాడరాదన్న నిబంధనలపై ప్రత్యేక దృష్టిపెడితే సత్ఫలితాలు వస్తాయి. అంతే కాకుండా నలుపు, నీలంతో పాటు రకరకాల రంగుల్లో ఉత్పత్తి కాకుండా కేవలం తెలుపు రంగుల్లో తప్ప వాడడానికి వీలులేదన్న గట్టి నిబంధన ఉన్నా వ్యాపారులు పట్టించుకోవడంలేదు.



కాటేదాన్‌లో ప్లాస్టిక్ సంచుల కార్ఖానాలో యంత్రం

నిబంధనలు పట్టక..

నిబంధనలను గాలికి వదిలేసి కాటేదాన్, గగన్‌పహాడ్, మహేశ్వరం సెగ్మెంట్ పరిధిలోని జల్‌పల్లి శ్రీరామకాలనీల్లోని పారిశ్రామికవాడల్లో ప్లాస్టిక్ సంచులు ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో నిత్యం ఆ ప్లాస్టిక్ కవర్లపైనే కోట్ల వ్యాపారం జరుగుతుంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో కాటేదాన్ గణేష్‌నగర్ మార్కెట్, అత్తాపూర్, శివరాంపల్లి, హసన్‌నగర్, బేగం బజార్.. ఇలా అన్నిచోట్లా యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. ఇటువంటివాటితో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. అవి మట్టిలో కలిసిపోవడానికి ఏళ్లతరబడి సమయం పడుతుంది. చెత్తకుప్పల్లో ప్లాస్టిక్‌ను పడేయడంతో మూగజీవాలు తింటూ మృత్యువాత పడుతున్నాయి. భూగర్భజలాలు పడిపోతున్నాయి. వినియోగించిన ప్లాస్టిక్‌ను కాల్చేస్తే వాయు కాలుష్యం ఏర్పడి ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయని పలువురు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మైలార్‌దేవుపల్లిలో ఖాళీ స్థలాల్లోని చెత్తలో ప్లాస్టిక్ సంచులు

కేసులు నమోదు చేయాలని ఆదేశిస్తాం:

–ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

40 మైక్రాన్‌లకంటే తక్కువ మందంగల ప్లాస్టిక్ సంచులు వాడితే చట్టప్రకారం కేసులు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకంగా ఈ విషయంపై ఆయా పారిశ్రామికవాడల్లో తనిఖీలు సర్కిల్ అధికారులకు ఆదేశాలిస్తాం. కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రజా సమస్యలపై ఉద్యమిద్దాం: సబితారెడ్డి



పార్టీలో చేరిన వారితో సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు

మణికొండ: ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపర్చి ఉద్యమించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని మాజీమంత్రి సబితారెడ్డి కోరారు. ఆదివారం గండిపేట్ మండలానికి చెందిన పలువురు ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గండిపేట్ మండల యువజన కమిటీ కార్యవర్గాన్ని వారు ప్రకటించారు. ఎంపికైన మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గణేష్‌సింగ్ (వట్టినాగులపల్లి)తో పాటు కార్యవర్గాన్ని వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన అవకాశాలపై ప్రకటనలే తప్ప ప్రభుత్వాలవి ఆచరణకు కానరావడం లేదన్నారు. హామీలు నెరవేర్చని ప్రభుత్వ తీరుపై ప్రజల్లోకి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీసుకెళ్లాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు శ్రేణులు సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నాగేష్‌యాదవ్, నాయకులు శిశుపాల్‌సింగ్, ముంతాజ్, భగవాన్‌సింగ్, విష్ణువర్ధన్ ఉన్నారు.

ప్రజావాణి నేడు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మీ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. సర్కిల్ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తవ్వి వదిలేస్తున్నారు..

● రోడ్లపై మట్టికుప్పలతో ప్రమాదాలు

శంషాబాద్ గ్రామీణ: శంషాబాద్‌లో రహదారులపై ప్రమాదకరంగా మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. అభివృద్ధి పనుల కోసం రహదారుల పక్కన గుత్తేదారులు ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. పనులు పూర్తైన వెంటనే రోడ్లపై పోసిన మట్టికుప్పలను తొలగించకుండా వదిలేస్తున్నారు. రేయింబవళ్లు కిక్కిరిసిన వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మట్టికుప్పలతో అసౌకర్యానికి గువుతున్నారు. అధికారులు చేష్టలుడిగి చూస్తుండడంతో గుత్తేదారులు తమ పని చేసి చేతులు దులుపుకొంటున్నారు. స్థానికులు, వాహనచోదకులు మాత్రం తంటాలు పడుతున్నారు.



మధురానగర్‌లో రహదారిపై తవ్వి వదిలేసిన మట్టి కుప్ప

శంషాబాద్-షాబాద్ రోడ్డుపై..

మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ అంతర్జాల సంస్థ సిబ్బంది నూతనంగా కేబుల్ వేస్తున్నారు. శంషాబాద్-షాబాద్ రహదారి పక్కన అక్కడక్కడ భారీ గోతులు తీసి ఎలక్ట్రానిక్ పరికరాలను భూగర్భంలో బిగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదర్శనగర్ సమీపంలో అంతర్జాలం పనులు పూర్తి చేసిన గుత్తేదారు రహదారిపై పోసిన మట్టి కుప్పలను నిర్లక్ష్యంగా వదిలేశాడు. రాత్రి సమయంలో మట్టి కుప్పలు గమనించకుండా వేగంగా వస్తున్న వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

మట్టికుప్పలతో మధురానగర్

శంషాబాద్, మధురానగర్ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల పనులు పూర్తయినా తవ్విన మట్టిని గుత్తేదారు తొలగించకుండా వదిలేశాడు. మట్టికుప్పలతో ఇరుకుగా మారిన ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా తవ్వినచోట రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి

శంషాబాద్ గ్రామీణ: నేటి డిజిటల్ యుగంలో రాణించాలంటే పాఠశాల దశలోనే ఆంగ్లంపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని శ్రీ చైతన్య స్కూల్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఇంగ్లిష్ క్లబ్ కార్యశాలను ఏర్పాటు చేశారు. నేటి సమాజంతో ముడిపడిన ఆంగ్లంపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠ్యాంశాలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు ప్రణాళికబద్ధంగా అభ్యసించాలని సూచించారు.

ఇంటింటా ఓటరు నమోదు ప్రారంభం



ఎంపీపీ వివరాలు నమోదు చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

మణికొండ: ఓటరు జాబితాలో తప్పులను, చిరునామాలను సరిదిద్దుకునే అవకాశం ఇంటింటి సర్వేతో కలుగుతుందని ఎంపీపీ తలారి మల్లేష్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో చేపట్టిన ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఎంపీపీ నివాసంలో గండిపేట్ మండల తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ట్యాబ్‌ల్లో ఆన్‌లైన్ ఓటరు నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాపై ఆన్‌లైన్ నమోదు చేపట్టామని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల పేర్లు, చిరునామా సరిచేసుకోవడంతో పాటు కొత్తగా ఓటర్ల పేర్లు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో చేపట్టిన ఈ నమోదు కార్యక్రమానికి అందరు సహకరించాలని కోరారు. సర్పంచి ఆర్.నర్సింహ, ఆర్ఐ నర్సింహ, గ్రామ రెవెన్యూకార్యదర్శి సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శంషాబాద్ గ్రామీణ: 18ఏళ్లు నిండిన యువత ఓటరు జాబితాలో తమ పేర్లను విధిగా నమోదు చేయించుకోవాలని శంషాబాద్ తహసీల్దార్ జి.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల తెరాస అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ జి.సురేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు... ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు దొర్లిన రెవెన్యూ అధికారుల దృష్టికి తేవాలన్నారు. అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వేరోస్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి



చౌదరిగూడలో స్వేరోస్ నూతన కమిటీతో జిల్లా నేతలు

శంషాబాద్ గ్రామీణ: చైతన్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దడమే స్వేరోస్ సంస్థ ప్రధాన లక్ష్యమని స్వేరోస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు జయసింహ స్పష్టం చేశారు. గుండెల్లో స్వేరో నాదం- ఇంటిపై స్వేరోస్ జెండా అన్న నినాదాన్ని ముందుకు తీసుకెళుతున్న క్రమంలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్వేరో మండల అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో చౌదరిగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎం.రమేశ్, ఉపాధ్యక్షుడుగా బి.లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు చెందిన పేద కుటుంబాల పిల్లలు నేటికీ విద్యకు దూరంగా ఉండడం విచారకరమన్నారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత స్వేరో కమిటీ సభ్యులపైనే ఉందన్నారు.

రాజేంద్రనగర్

డయల్ యువర్ డీఎం కార్యక్రమం నేడు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని డీఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని అన్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డిపో మేనేజర్ వెంకట్‌రెడ్డి నేరుగా సమాధానాలు ఇస్తారు. ఫిర్యాదులు చేయాల్సిన వారు 99592 26135 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



తిరుమలహిల్స్‌లో పూజల్లో విశ్రాంత న్యాయమూర్తి ప్రకాశ్‌రావు తదితరులు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..



కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు,

మూడోరోజు పూజలందుకున్న గణనాథుడు

పత్తికుంటలో నిమజ్జనాలు ప్రారంభం

రాజేంద్రనగర్: సర్కిల్ పరిధిలో గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం మూడోరోజు పూజలు ఘనంగా నిర్వహించారు. ఉప్పర్‌పల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో వినాయకుడి మండపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండప నిర్వహకులు పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు. నలందానగర్‌కాలనీలో మట్టి వినాయకుడి దగ్గర కాలనీ అసోసియేషన్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తిగీతాలతో ఆలరించారు. హైదర్‌గూడ నేతాజీ యువజనసంఘం ఆధ్వర్యంలోని విగ్రహం వద్ద స్థానిక కార్పొరేటర్ విజయాజంగయ్య పూజల్లో పాల్గొన్నారు. బుద్వేల్ భగవతిగూడలోని చిన్ని కృష్ణయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గౌరనందాభక్తసమాజ్ వారితో ప్రత్యేక భజనా కార్యక్రమాలను నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు రాజ్‌కుమార్‌యాదవ్, పర్వతాలు యాదవ్, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పద్మశాలిపురం పద్మజ్యోతి యువజన సంఘం మండపంలో కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. వినాయకుడి దండను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారి మెడలో వేశారు. అత్తాపూర్, ఎర్రబోడ, బుద్వేల్, రాజేంద్రనగర్ తదితర బస్తీలలో ప్రతిష్ఠించిన విగ్రహాల దగ్గర ప్రత్యక పూజలు నిర్వహించారు.

మూడోరోజు నిమజ్జనాలు ప్రారంభం

రాజేంద్రనగర్ సర్కిల్లోని పత్తికుంట చెరువులో గణేష్ నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మూడోరోజు చిన్నచిన్న విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. ఇళ్లలో ప్రతిష్ఠించిన విగ్రహాలను తీసుకొని పలువురు కుటుంబ సభ్యులతో తరలివచ్చి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పత్తికుంట దగ్గర పారిశుద్ధ్య సిబ్బంది భక్తులకు సహకరించారు. అయితే నిమజ్జనానికి సంబంధించి అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని సర్కిల్ ఉత్సవకమిటీ నాయకులు వై.శ్రీధర్ ఆరోపించారు.

కాటేదాన్: వరాలిచ్చే దేవుడు విఘ్నేశ్వరుడని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొలువైన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిత్యాన్నదానం నిర్వహిస్తున్న కన్యాకా పరమేశ్వరి ఆలయ కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. బుచ్చయ్యగుప్త, శ్రీనివాస్‌గుప్త, లక్ష్మయ్య గుప్త పాల్గొన్నారు.

- మైలార్‌దేవుపల్లి డివిజన్ మార్కండేయనగర్ నవోదయ యువజన సంఘం ఏర్పాటుచేసిన మండపంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సూర్యనారాయణ, వరకాల చందు, రమేష్, రాము, గోపాల్, పాల్గొన్నారు.
- లక్ష్మీగూడ హసింగ్ బోర్డు కాలనీ వినాయకుడికి భాజపా నేత అడికెరాజు ప్రత్యేక పూజలు చేశారు. ప్రగతి కాలని విఘ్నేశ్వరుడికి భాజపా జిల్లా సమాచార హక్కుచట్టం కన్వీనర్ నవారు మురళీధర్‌రెడ్డి, లక్ష్మీగూడలో మైలార్‌దేవుపల్లి డివిజన్ భాజపా అధ్యక్షులు అడికె జనార్దన్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

చెరువుల్లో గణనాథుల నిమజ్జనంపై వాగ్వాదం


మణికొండ: నేక్‌నాంపూర్ గ్రామ పరిధిలోని చెరువుల్లో వినాయక నిమజ్జన నిర్వహణపై ఆదివారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గణేష్ ఉత్సవాల్లో మూడో రోజు కావడంతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఉదయం నెక్నాంపూర్ చిన్నచెరువు వద్ద భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విగ్రహాల నిమజ్జనం చేసి వ్యర్థాలతో చెరువును కలుషితం చేయొద్దని ధ్రువాంశ్ ప్రతినిధి మధులిక సిబ్బందితో అభ్యంతరం తెలిపింది. విషయం తెలుసుకున్న సర్పంచి ఉశేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు తామోదన్‌రావు, కాలనీవాసులు అక్కడికి చేరుకొని ఆమెతో వాగ్వాదానికి దిగారు. నార్సింగి సీఐ జీవి రమణ్‌గౌడ్ అక్కడికి చేరుకొని సర్పంచి ఉశేష్‌కుమార్, ధ్రువాంశ్ ప్రతినిధి మధులిక, కాలనీసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్, మనోజ్ తదితరులతో చర్చించారు. నిమజ్జన కొలను నిర్మాణం త్వరగా పూర్తిచేయించే వరకు నివాసాల్లోని వినాయక విగ్రహాల నిమజ్జనానికి అడ్డుచెప్పవద్దని సీఐ వారికి సూచించారు. చిన్నచెరువులో వినాయక నిమజ్జనంతో పోగైన వ్యర్థాలు తొలగించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని సర్పంచి వెల్లడించడంతో.. చెరువులో నిమజ్జనానికి అడ్డంకులు తొలగాయి. పెద్దసంఖ్యలో తరలివచ్చిన కాలనీవాసులు తమ గణనాథులను చిన్నచెరువులో నిమజ్జనం చేశారు.



నెక్నాంపూర్ చిన్నచెరువులో వినాయక నిమజ్జనం



పత్తికుంట వద్ద విగ్రహాల నిమజ్జనంలో పారిశుద్ధ్య సిబ్బంది



మణికొండ నవజ్యోతి యువజన సంఘం మండపంలో పూజల్లో పాల్గొన్న స్థానికులు



నెక్నాంపూర్ చిన్నచెరువు వద్ద నిమజ్జన నిర్వహణపై చర్చిస్తున్న సీఐ రమణ్‌గౌడ్, సర్పంచి ఉశేష్‌కుమార్

కస్తూర్బాట్రస్టులో ఉచిత వైద్యశిబిరం

నార్సింగి, న్యూస్‌టుడే: హైదర్షాకోట్‌లోని కస్తూర్బాగాంధీ జాతీయ స్మారక ట్రస్టులో గాంధీ మెడికల్ కళాశాలకు చెందిన 2014 బ్యాచ్ వైద్య విద్యార్థినులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు డా.అమృత, డా.ప్రేమజ్యోతి, డా.మహేష్, డా.అనిత, డా.శిరీషలు ట్రస్టులో ఆశ్రయం పొందుతున్న మహిళలు, యువతులు, పిల్లలను పరీక్షించి ఉచితంగా మందులు కూడా అందజేశారు. అదేవిధంగా 150 మందికి సబ్బులు, తలనూనె, పేస్టు తదితరాలను అదజేశారు. అందరికీ భోజనం పెట్టించారు.

భారీ వర్షంతో పొంగిన డ్రైనేజీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగు పలు చోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పలు బస్తీలలో మురుగు రహదారులపై ప్రవహించింది. అత్తాపూర్ పాండురంగానగర్, రాంబాగ్‌లలో మ్యాన్‌హోళ్లు నిండి మురుగు రోడ్లను ముంచెత్తడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సులేమానగర్ డివిజన్‌లోని చింతల్‌మెట్‌లో మురుగు సమస్య తీవ్రంగా మారింది. ఇక్కడ ఎగువ బస్తీల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవహిస్తుండటంతో సమస్య తీవ్రమైంది. ఎగువన ఉన్న పలు బస్తీలలోని వరద మురుగు పోటెత్తి దిగువ ప్రాంతాలలోని చితంల్‌మెట్ ప్రధాన రహదారితో పాటు ఉప్పర్‌పల్లి ప్రధాన రహదారి వరకు వరద వచ్చి చేరుతోంది.



బృందావన్‌కాలనీ రహదారి పరిస్థితి



ఎర్రబోడలో పొంగుతున్న డ్రైనేజీ

కల్లుగీత కార్మిక సంఘం కార్యవర్గం

ఉడుకు రక్తం.. తలచుకుంటే ఏదైనా సాధించొచ్చు.. కఠిన లక్ష్యాలను సైతం సుసాధ్యం చేయొచ్చు. కొండలను పిండి చేయొచ్చు. అయితే ఇదంతా సన్మార్గానికి ఉపయోగించుకుంటేనే సుమా. తమ తెలివిని, పరిజ్ఞానాన్ని ఏమాత్రం తప్పుడు మార్గాలకు ఉపయోగించినా భవిష్యత్తు అంధకారమే. తెలిసో తెలియకో ఎవరైనా దారి తప్పినా తిరిగి వారిని మనిషిగా మార్చడం అవసరం. అది సకాలంలో జరగకపోతే బతుకు అగమ్యగోచరంలో పడుతుంది. అందుకే రాచకొండ పోలీసులు ఈ విషయంలో ప్రత్యేక చొరవతో ప్రణాళిక రూపొందించారు. అందుకు అమృత ఫౌండేషన్ నిర్వాహకులు తగిన సహకారం అందిస్తున్నారు. ఆ బృహత్ కార్యమే 'నయా సవేరా'. కొత్త ఉదయం అనే అర్థమిచ్చే ఈ కార్యక్రమానికి ఇటీవలే బీజం పడింది.

మద్యం, ధూమపానం, మాదకద్రవ్యాలు, జూదం, క్రికెట్ బెట్టింగ్.. యువతను ఎక్కువగా ఆకర్షించే విష వలయాలివి. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులు వీటి బారిన పడేందుకు అవకాశాలు ఎక్కువ. ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి ఇటీవల పరిణామాలు. అందుకే నగర శివార్లలోని ఇంజినీరింగ్ కళాశాలలపై దృష్టి సారించారు రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్. నయా సవేరా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, ఎల్బీనగర్, హయత్‌నగర్, ఘట్‌కేసర్.. తదితర ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. మాదకద్రవ్యాలతో పాటు ఇతర చెడు వ్యసనాలకు ఏదైనా కళాశాల విద్యార్థులు బానిసలుగా మారినట్లు తమ దృష్టికి వచ్చినా.. ఆ తరహా కేసుల్లో ఇరుక్కున్నా ఆయా విద్యాలయాల్లో అవగాహన సదస్సులు జరపాలని నిర్ణయించారు. ఇందు కోసం అమృత ఫౌండేషన్ సహకారం తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కళాశాలల్లో ఫౌండేషన్ నిర్వాహకురాలు దేవి కారాణి ఆధ్వర్యంలో చైతన్యం కల్పిస్తారు. వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సమాజంలో ఎదురయ్యే అవమానాల గురించి వివరిస్తారు. అనంతరం ఆయా విద్యార్థుల కుటుంబసభ్యులను పిలిచి.. వారి సమక్షంలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. తద్వారా విద్యార్థుల్లో కనువిప్పు కలిగేందుకు ఆస్కారముంటుందని భావిస్తున్నారు. ఒకవేళ విద్యార్థులు అప్పటికే బానిసలైతే వారిని పునరావాస కేంద్రాల్లో చేర్పించేందుకు సహకారం అందిస్తారు. వారిని తిరిగి మామూలు మనుషులను చేసి.. జీవితాల్లో కొత్త వెలుగుల్ని నింపడమే నయా సవేరా లక్ష్యమని మహేశ్ భగవత్ తెలిపారు.

"దారి తప్పిన విద్యార్థులను ఎంత త్వరగా గుర్తిస్తే.. తిరిగి సన్మార్గంలో నడిపించే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయన్నది అమృత ఫౌండేషన్ నిర్వాహకురాలు దేవికారాణి మాట. ఈ విషయంలో తల్లిదండ్రులతోపాటు కళాశాలల నిర్వాహకులదే కీలక పాత్ర అని చెబుతున్నారు."



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, సీపీ మహేశ్ భగవత్

గుర్తించడమే కీలకం

దుర్వ్యసనాలకు బానిసలైన వారిని గుర్తించడమే నయా సవేరా కార్యక్రమంలో కీలకం. ఇందుకోసం ఇటీవలే కమిషనరేట్ పరిధిలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాల్సిన బాధ్యత గురించి వివరించారు. అకడమిక్ విషయాలపై తరచూ ఆరా తీస్తుండడంతో పాటు నడవడికను గమనిస్తూనే వసతిగృహాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎక్కువగా డబ్బులు ఖర్చు చేసే విద్యార్థుల వైఖరిని గమనిస్తూ తల్లిదండ్రులను హెచ్చరించేలా కార్యాచరణ అమలు చేయబోతున్నారు. ఇప్పటికే నాలుగు కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించగా.. రాబోయే రోజుల్లో అన్నిచోట్ల జరిపేలా ప్రణాళికలు రూపొందించారు.

నిలువెల్లా పచ్చదనమే

ఎక్కడ మొక్కలు ఉంటాయో ఆ పరిసరాలు ఆహ్లాదకరంగా మారిపోతాయి. చివరికి తీగ జాతులైనా సరే అవి తెచ్చే శోభ వేరు. అంబర్‌పేటలోని డి.డి.కాలనీలో కనిపించిందీ దృశ్యం. ఓ భవనం కింద నుంచి పై అంతస్తుల వరకు పచ్చని లతల అల్లికతో చూసేవారిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది.





అటవీ బాట

అమ్రాబాద్‌కు మూషిక జింకలు


జింకలందు రకాలు వేరయా అన్నట్లుగా హైదరాబాద్ నగరంలోని నెహ్రూ జూ పార్కులో అనేకం కనువిందు చేస్తుంటాయి. కృష్ణ జింకలు, సాంబార్, హగ్‌డీర్, బార్కింగ్‌డీర్, థామన్‌డీర్, చౌసింగా తదితర జాతులు ఉన్నాయి. మూషిక జింకలకైతే కొదవే లేదు. ఒకటి రెండు కాదు దాదాపు 200కు పైగా ఉన్నాయి.. 2010లో మూషిక జాతి జింకల సంతానోత్పత్తి కేంద్రం(మౌస్ డీర్ బ్రీడింగ్)గా ఈ జూపార్కును కేంద్ర జంతు సంరక్షణ సంస్థ(సీజడ్ఏ) గుర్తించింది. తొలుత రెండు మగ, మరో నాలుగు ఆడ మూషిక జింకలను ఈ కేంద్రానికి రప్పించారు. ఇవి తమ సంతతిని ఇబ్బడిముబ్బడిగా పెంచాయి. వీటిని జంతుమార్పిడి విధానంలో భాగంగా ఇతర జూపార్కులకు పంపించి కొత్త జంతువులను అధికారులు తెప్పించిన సందర్భాలున్నాయి. అయిదారేళ్ల వరకు జీవించే మూషిక జింకలు ఆరునెలల లోపు సంతానోత్పత్తి దశకు చేరకుంటాయి. వీటి ఆహారం పచ్చగడ్డి. ప్రస్తుతం ఇక్కడ ఉన్నవాటిలో కొన్నింటిని మహబూబ్‌నగర్ జిల్లా శివారు అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో వదిలిపెట్టాలని నిర్ణయించారు.. అటవీ శాఖ అధికారుల సూచనల మేరకు త్వరలో వాటిని వదిలేందుకు సన్నాహాలు పూర్తిచేస్తున్నారు.



విచిత్ర స్నేహ బంధం

నెహ్రూ జూపార్కులో జంతువుల విచిత్ర స్నేహ బంధం కూడా ముచ్చట గొలుపుతుంటుంది. ఇక్కడ చుక్కల జింకలు(స్పాటెడ్‌డీర్) విస్తృతంగా ఉన్నాయి. ఎన్‌క్లోజర్లలోనే కాదు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుంటాయి. వీటిలోని కొన్ని ధైర్యంగా పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల వద్దా కనిపిస్తుంటాయి. తమ పక్కన చెంగు చెంగున గంతులు వేసే వీటిని మగ సింహాలు ఏమీ అనవు. ఆడ సింహాలు మాత్రం వేటలో తమ పోకడను మానుకోకుండా జింకల మందను తరుముతుంటాయి.


–చార్మినార్, న్యూస్‌టుడే



ఇన్నాళ్లూ నోరెళ్లబెట్టిన చెరువులు చినుకుల సవ్వడితో కొత్త సొబగు సంతరించుకుంటున్నాయి. హయత్‌నగర్ శివారు పసుమాముల చెరువు ఇది. అధికంగా నీరు చేరి కళకళలాడుతోంది. ఆ జలంతో సాగుచేస్తున్న పొలాల్లో పనుల్లో నిమగ్నమైన మహిళలు.







ఎక్కడున్నావమ్మా చరవాణి!

- ఒక్క క్షణం విడిచి ఉండలేని పరిస్థితి
- యువతలో పెరుగుతున్న రుగ్మత

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే

చరవాణి లేకుండా క్షణం ఉండలేని సురేష్ ఇంట్లోవారితో మాట్లాడడం తగ్గిపోయింది. అందరూ ఉన్నా ముభావంగా వ్యవహరించడం, వణకడం, స్థిరత్వం లేని చూపులు, నిలకడ లేని ప్రవర్తన చూసి కుటుంబసభ్యులు కలత చెందారు. అతనిలో వస్తున్న మార్పుతో నిపుణులను సంప్రదించగా 'నోమోఫోబియా'తో బాధపడుతున్నాడని తేల్చారు. సకాలంలో గుర్తించి కొద్దిపాటి కౌన్సెలింగ్‌తో అతని సమస్యను పోగొట్టారు.

ఇదో రకం వ్యసనం

చరవాణి లేకపోతే ఏర్పడే భయాన్నే నోమో ఫోబియాగా చెబుతుంటారు. 'నో మొబైల్ ఫోన్ ఫోబియా' అనే పదం నుంచి సంక్షిప్తంగా దీనిని నిర్వచిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో చరవాణులను వాడుతున్న దేశంగా భారత్ అవతరిస్తోంది. ఈ క్రమంలోనే ఈ రుగ్మతకు గురవుతున్న అత్యధిక బాధితుల సరసన కూడా చేరబోతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే అనేకమంది యువత చరవాణి లేకుండా ఉండలేని స్థితికి చేరుతున్నారు. దీని తర్వాతి దశ నోమోఫోబియానే అని మనస్తత్వవేత్తలు హెచ్చరిస్తున్నారు. అమెరికా వంటి దేశాల్లో పెద్దలలోనూ ఈ సమస్య ఎక్కువగా ఉంది. 66 శాతం మంది మధ్య, పెద్దవయస్కులు దీనిని ఎదుర్కొంటున్నారు.

ఇవీ లక్షణాలు

- చరవాణి, కంప్యూటర్ వంటి పరికరాలు అందుబాటులో లేకపోయినా, సిగ్నల్స్ సరిగ్గా అందకపోయినా ఆందోళనకు గురవుతారు.
- కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులతో ముఖాముఖిగా కలిసేందుకు మానసిక సంసిద్ధత గణనీయంగా తగ్గిపోతుంది.
- ఒంటరితనం, కుంగుబాటుతో బాధపడతారు.
- బయటకు వెళ్లాల్సి వస్తే ఛార్జర్, పవర్ బ్యాంక్, అదనపు డివైస్‌లను వెంటే తీసుకువెళ్లాలనుకుంటారు.
- చెమటలు కారడం, వణుకుడు, ఆందోళన, తమను తామే కొట్టుకోవడం వంటివి కనిపిస్తాయి.



చరవాణికి యువత బానిసలవుతున్నారని అంతర్జాతీయ సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఈ పరిస్థితి ఇప్పుడిప్పుడే తీవ్రరూపం దాలుస్తోంది. ప్రస్తుతం 23 శాతం యువత నోమోఫోబియాకు గురవుతున్నారు. ముంబయి, దిల్లీ తర్వాత స్థానాల్లో మన నగరమేనని నివేదికల సారాంశం. యువత, విద్యార్థులు రోజులో కనీసం 31 పర్యాయాలు చరవాణిని చూసుకుంటున్నారు. సుమారు 9 గంటల పాటు గడుపుతున్నారని తేలింది. పదేపదే ఈ రకమైన కాలక్షేపం వల్ల మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని చెబుతున్నారు.



ఇలా బయటపడొచ్చు

సకాలంలో ఈ లక్షణాలను పసిగట్టి, తగిన మానసిక చికిత్స ఇప్పిస్తే సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉంది. బాధితులకు బృంద చర్చలు (గ్రూప్ డిస్కషన్), నెలలో ఒకరోజు చరవాణి, కంప్యూటర్, ట్యాబ్ వంటివాటికి దూరంగా ఉంచడం, నిద్ర పోవడానికి ముందు వీటిని కనీసం పదిహేను అడుగుల దూరంలో ఉంచడం చేయాలి. ఫోన్ పక్కనే ఉంటే నిద్రాభంగమే. కుటుంబీకులు, స్నేహితులు వీరితో ఎక్కువ సమయాన్ని గడపడం వల్ల సాధారణ పరిస్థితులు సృష్టించవచ్చన్నది నిపుణులు చెప్పేమాట. ఇటీవల నగరంలో రెండు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన కార్యశాలల్లో ఇదే అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. స్నేహితులు, బంధువులతో ఫోన్‌లో కాకుండా నేరుగా కలిసి మాట్లాడడం వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయి. చరవాణి, కంప్యూటర్‌లతో చేయాల్సిన పనులకు ఒక నిర్ణీత సమయం పెట్టుకోవడం వంటివి చేయొచ్చు. ఏదేమైనా ఎవరికివారికి స్వీయ నియంత్రణ అవసరం.

మరిన్ని ప్రత్యామ్నాయాలు


తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థల్లో చరవాణిలను బహిష్కరించింది. దానిని పాఠశాలలు, కళాశాలలకే పరిమితం చేయకుండా విశ్వవిద్యాలయాలకూ వర్తింపజేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే అంతర్జాలం ఆధారంగా పనిచేసే ప్రైవేటు కార్యాలయాల్లోని యువతకు చరవాణి అనివార్యం. అక్కడ విధులు నిర్వర్తించేవారికి రెండురోజులు వారాంతపు సెలవులు ఉన్నా, ఎక్కువ మంది వాటి ద్వారా ఆయా రోజుల్లోనూ కార్యకలాపాలను కొనసాగిస్తుంటారు. ఈ పనులకంటూ కచ్చితమైన ఒక సమయం పెట్టుకుంటే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు.

సమస్య నుంచి బయటపడొచ్చు



ఎం.రాంచందర్, మనస్తత్వవేత్త

అతి సర్వత్ర వర్జయేత్ అని పెద్దలు చెప్పకనే చెప్పారు. నోమోఫోబియా బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సమస్య నుంచి దూరం చేయవచ్చు. ఆలోచనల్లో మార్పులు తీసుకురావడం, టాక్ థెరపీ, విశ్రాంతి(రిలాక్సేషన్) పద్ధతుల ద్వారా సమస్యను పరిష్కరించొచ్చు. నెట్‌వర్క్‌ను పరిమితంగా వినియోగించుకునేలా మార్గనిర్దేశనం చేస్తాం.



తినొచ్చు.. సైకిలూ తొక్కొచ్చు!






నగరంలో భిన్న పోకడలు

వైవిధ్యానికి ప్రాధాన్యమిస్తోన్న ఆహారశాలలు

సాధారణంగా ఏదైనా ఆహారశాలకు వెళితే ఏం చేస్తాం. మనం సూచించిన పదార్థాలు తెచ్చేవరకు కాలక్షేపం కోసం కాసేపు కబుర్లు చెప్పుకుంటాం. మరింత సమయం పడుతుందనుకుంటే పజిల్స్ ఆడుకుంటాం. కానీ సైకిల్ గురించి కూడా తెలుసుకోవచ్చు అంటోంది ఓ కేఫ్. అంతేకాదు వడ్డించేవరకు అలా తొక్కుకుంటూ రావొచ్చు. అద్దెకు తీసుకోవచ్చు.. నచ్చితే అక్కడే సైకిల్ కొనుక్కోవచ్చు.



ఈనాడు, హైదరాబాద్

నగరవాసుల అభిరుచులకు తగ్గట్టుగా స్థానిక, దేశీ, విదేశీ రుచులను అందించేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఆహారశాలలు వెలుస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు సంస్థలు తమ శాఖలను హైదరాబాద్‌లో ప్రారంభించాయి. రుచులతో పాటు సరికొత్త పోకడలను తీసుకొస్తున్నాయి. దేశంలో చెన్నైలో మొదటగా ప్రారంభమైన సిక్లో కేఫ్.. గత ఏడాది ఆఖరులో నగరంలోనూ ఏర్పాటైంది. రుచుల విందుతో పాటు సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తోంది.

అలంకరణ ప్రత్యేకం

ఈ ఆహారశాలలో మిగతా వాటికి భిన్నంగా అలంకరణ మొత్తం సైకిల్ చుట్టూనే తిరుగుతుంది. లోపల అడుగు పెట్టిన దగ్గర్నుంచి సైకిల్ విశేషాలే అడుగడుగున కన్పిస్తుంటాయి. సైక్లింగ్ గురించి మనకు తెలియని చాలా సంగతులను బంజారాహిల్స్‌లోని ఆ సంస్థలో విందు ఆరగిస్తూ తెలుసుకోవచ్చు.

వారికి అడ్డా

ఆరోగ్యం, సరదా కోసం సైకిల్ తొక్కడం మొదలెట్టినా ప్రొఫెషనల్‌గా తీసుకునేవాళ్లూ ఉన్నారు. ఇలాంటి వారికి సమాచారం, ఇప్పటికే అలాంటి పోటీల్లో పాల్గొన్నవారి అనుభవాలు ఎంతో అవసరం. ఈ రెండింటికి వేదికగానూ ఉంటూ సైక్లిస్ట్‌లు మరింత నైపుణ్యంగా రాణించేందుకు ఉపకరిస్తుండడం విశేషం. వారం వారం అంతా కలిసి రైడ్స్‌కు వెళ్లేందుకు వేదికగానూ మారింది.

ఎన్నెన్నో..


సైకిళ్ల గురించి.. కొత్తగా వస్తున్న వాటి ధరలు వింటే ఆశ్చర్యపోక తప్పదు. వాటి ధరలు ద్విచక్రవాహనాలు, కార్లతో పోటీపడుతున్నాయి. దేశీయ మోడల్స్‌తో పాటు విదేశీ రకాలు మార్కెట్‌లోకి వచ్చాయి. రూ.10వేల నుంచి రూ.2.97 లక్షల వరకు పలుకుతున్నాయి. రూ.3లక్షలా అని నోరెళ్లబెడితే రూ.5 లక్షలవీ ఆర్డర్‌పై తెప్పిస్తామంటున్నారు. ఉపయోగించే సాంకేతికత, సామగ్రిని బట్టి సైకిళ్లలోనూ హైఎండ్ మోడల్స్ ఉన్నాయి. ఇవన్నీ కేఫ్‌లో చూడొచ్చు. ఇక అందరూ ఖరీదైన సైకిళ్లను కొనలేకపోవచ్చు. అలాగని వాటిపై ఆశ వదులుకోనక్కర్లేదు.. గంట, రోజు, నెలకు అద్దెకు తీసుకుని ముచ్చట తీర్చుకోవచ్చు. ఖరీదైన సైకిళ్లు కాబట్టి అద్దెలు కొంచెం ఎక్కువే.

అవగాహన పెరుగుతోంది



- అశీష్ తడాని, సీఈవో, సిక్లో కేఫ్

నగరంలో సైక్లింగ్‌పై అవగాహన పెరుగుతోంది. సిటీ వాసులు తరచూ రైడ్స్‌కు వెళుతున్నారు. రాబోయే సంవత్సరాల్లో ఇంకా విస్తృతమవుతుంది. ఈ దృష్ట్యా ఔత్సాహిక సైక్లిస్టుల కోసం సిక్లో కేఫ్ ఏర్పాటు చేశాం. నిజానికి ఇది ఆహారశాల. కోరుకునే రుచులను వడ్డించడంతో పాటు సైకిల్‌కు సంబంధించిన సమస్త సమాచారం, కొత్త మోడళ్ల వివరాలన్నీ లభిస్తాయి.



పురవీధుల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఎల్ఈడీ దీపాలు నగరానికి కొత్త అందాల్ని తీసుకువస్తున్నాయి. పాల వెన్నెల లాంటి తెల్లటి వెలుగు వాహన చోదకులకు సౌకర్యంగా ఉంది. మెహిదీపట్నం ఎన్ఎండీసీ నుంచి సరోజిని దేవీ కంటి ఆస్పత్రి మధ్య దీప కాంతుల అందాలు ఇవి. – టంటం రమేష్, మెహిదీపట్నం



వద్దీ రద్దీ

అసలే హైటెక్ సిటీ వైపు వెళ్లే ట్రాఫిక్. ఈ మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అలాంటి మార్గాన్ని తోపుడు బండ్లు ఎలా ఆక్రమించాయో చూడండి. – చరిత, కేపీహెచ్‌బీ కాలనీ



దీనిని పాదచారులు నడిచే ఫుట్‌పాత్ అంటారా? అసలు నడిచేందుకు వీలవుతుందా? వెంగళరావు నగర్-ఎస్ఆర్ నగర్ మార్గంలో దుస్థితి. –వీకే రాజు, సిద్దార్థనగర్ నార్త్




విద్యార్థులు తిరిగే ప్రాంతం. మూసాపేట ఆంజనేయ నగర్‌లో విద్యుత్తు స్తంభం ఎంత ప్రమాదకరంగా ఒరిగిందో చూడండి. –భరత్‌రాజు, మూసాపేట



దిల్‌సుఖ్‌నగర్‌లో హెరిటేజ్ కారు రోడ్డుపై ఆగిపోయింది. స్థానికులు ఆశ్చర్యంగా తిలకించి సెల్ఫీలు తీసుకున్నారు. –మహేశ్, వనస్థలిపురం

పౌర పాత్రికేయం వాట్సాప్ నంబరు: 8008001763

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? మీ పేరు, ప్రాంతం తదితర వివరాలతో వాటిని మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.



మూసాపేట నుంచి ప్రశాంత్‌నగర్ వైపు నిత్యం వందల మంది వెళ్లే బ్రిడ్జి ఇది. రెండు వైపులా ఫెన్సింగ్ ఉండేది. కొన్ని నెలల కిందట ఒకవైపు పడిపోయింది. వర్షాకాలంలో ప్రమాదం పొంచిఉంది. – మూడే రవినాయక్, హార్ట్ టు హెల్ప్ ఛారిటబుల్ ట్రస్టు



హరిత హాహాకారం!

మొక్కకేది రక్షణ. హరిత హారంలో భాగంగా మొక్కలు నాటారు. వాటికి రక్షణ కల్పిస్తే మేలు. పాశమైలారం కమాన్ వద్ద కనిపించిన దృశ్యం. – పాపరాజు, పాశమైలారం



రోడ్డు పక్కనే మద్యం తాగుతూ ఎల్‌బీ నగర్ క్రాస్‌రోడ్‌లో కనిపించి దృశ్యం. ఇలాంటివి నగరంలో నిత్యకృత్యంగా మారాయి.

– మహేందర్, ఇబ్రహీంపట్నం

అయ్యప్ప సొసైటీ రోడ్ నంబరు-12 దుస్థితి. హైటెక్ సిటీకి చేరువగా ఉన్నా ఇదీ పరిస్థితి.

– సతీష్, మాదాపూర్





పనులను ప్రారంభిస్తున్న మంత్రులు తలసాని, పద్మారావు తదితరులు

వెల్లింగ్‌టన్ వంతెనను ప్రారంభించిన మంత్రులు

కంటోన్మెంట్: నగర శివార్ల నుంచి కంటోన్మెంట్ ప్రాంతం మీదుగా నగరానికి రాకపోకలు సాగించే వాహనదారుల ట్రాఫిక్ సమస్యలు తీర్చేందుకు కంటోన్మెంట్ బోర్డు పరిధి లోని ప్రధాన రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణం చేపట్టడం సంతోషకరమని రాష్ట్ర మంత్రులు టి.పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. రూ.1.20 కోట్లతో కంటోన్మెంట్ ప్రాంతం పికెట్ చౌరస్తా సమీపంలో వెల్లింగ్‌టన్ వంతెన పునఃనిర్మాణం చేపట్టారు. రాష్ట్ర మంత్రులు టి.పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ సీహెచ్ మల్లారెడ్డి, ఎమ్మెల్యే జి.సాయన్న, బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎండీ ఉపాధ్యాయ్, ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ, సీఈఓ ఎస్‌వీఆర్ చంద్రశేఖర్ తదితరులతో కలిసి ఆదివారం నూతన వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. బోర్డు సభ్యులు నళినీకిరణ్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కె.పాండుయాదవ్, లోకనాథం, మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మాజీ సభ్యులు బి.ప్రభాకర్, పి.వెంకట్‌రావు, కంటోన్మెంట్ బోర్డు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో ఇంటి స్థలాల విక్రయం

స్థిరాస్తి వ్యాపారులపై కేసు నమోదు

ఘట్‌కేసర్: తప్పుడు పత్రాలతో రూ.కోట్ల విలువ చేసే భూములను అమ్మేసి కొనుగోలుదారులను మోసగించిన ఏడుగురు స్థిరాస్తి వ్యాపారులపై రాచకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రకాష్ వివరాల ప్రకారం. . ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 867 బై1లో నగరానికి చెందిన స్థిరాస్తి వ్యాపారులు మేకల దుర్గారెడ్డి, ఎ.వెంకటేశ్, బి.శ్రీకాంత్, సీహెచ్ వెంకట్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, జె.నరేందర్‌రెడ్డి, ఆర్.వెంకట్‌రెడ్డి నుంచి ఘట్‌కేసర్ మండలం కొర్రెములకు చెందిన జి.సాంబయ్య అనే మేస్త్రీ, మరికొందరు అక్కడే ఇంటి స్థలాలు కొనుగోలు చేశారు. వీరికి స్థిరాస్తి వ్యాపారులు మాయమాటలు చెప్పి ఇంటి స్థలాలు అమ్మేశారు. పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు నిర్మాణాలు నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు. కొనుగోలుదారులు స్థిరాస్తి వ్యాపారుల వద్దకు వెళ్లి తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడిగారు. వ్యాపారులు కనిపించకుండా పోయారు. ఈ నెల 21న పంచాయతీ అధికారులు నిర్మాణాలను కూల్చివేశారు. బాధితులు పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శిరస్త్రాణం, డ్రైవింగ్ లైసెన్స్ లేదని చితకబాదిన ట్రాఫిక్ పోలీసులు

మాదన్నపేటకు చెందిన మహమ్మద్ షాహీద్ ఫిర్యాదు




బాధితుడు మహమ్మద్ షాహీద్, హోంగార్డు సుధీర్‌కుమార్

కాచిగూడ: శిరస్త్రాణం, డ్రైవింగ్ లైసెన్స్ లేదని తనను కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు చితకబాదారంటూ ఓ యువకుడు ఆదివారం రాత్రి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వేగంగా వెళుతున్న యువకుడిని ఆపితే అతను తనను ఢీకొట్టి పడిపోయాడని ట్రాఫిక్ హోంగార్డు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం, బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... మాదన్నపేట శ్రీనగర్‌కు చెందిన మహమ్మద్ షాహీద్ (21) ప్రైవేట్ పని చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు నింబోలిఅడ్డలోని పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మహమ్మద్ షాహీద్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో గదిలోకి లాక్కెళ్లి ట్రాఫిక్ ఎస్సై రాంరెడ్డి, ముగ్గురు కానిస్టేబుళ్లు అతన్ని చితకబాదారు. ఈ మేరకు బాధితుడు ఆదివారం రాత్రి 7.45 గంటలకు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపీసీ 324 కింద కేసు నమోదు చేశారు.

ముందే ఫిర్యాదు : నింబోలిఅడ్డలో వాహనాలను తనిఖీ చేస్తుండగా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడిని ఆపడానికి యత్నించగా అతను తనను ఢీకొట్టి కింద పడిపోయాడని కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు సుధీర్‌కుమార్ ఆదివారం సాయంత్రం 6 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐపీసీ 324, 337 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎస్సై మధు కేసులను దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సంజీవరెడ్డినగర్: దేవాలయాల్లో పనిచేసే అర్చకులు, ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లిస్తామని గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేదంటే తాము మరోసారి ఉద్యమం చేయాల్సి వస్తుందని తెలంగాణ రాష్ట్ర ఆలయ అర్చక, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బేతి రంగారెడ్డి హెచ్చరించారు. సనత్‌నగర్, అమీర్‌పేటకు చెందిన పలు దేవాలయాలకు చెందిన అర్చకులు, ఉద్యోగులతో సంజీవరెడ్డినగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర దేవస్థానం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ వైష్ణవ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వేణుగోపాలాచార్యులు, అర్చక సమాఖ్య తెలంగాణ అధ్యక్షుడు పి.రవీంద్రాచారి, వివిధ ఆలయాల అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం ఇలాగేనా?



- ప్రమాదకరంగా ప్రధాన దారులు
- రోడ్డుకిరువైపులా కాలువలా మారినా నిర్లక్ష్యం

ఈనాడు – హైదరాబాద్

నగరంలో అభివృద్ధి పనులు గుడ్డిగా జరిగిపోతున్నాయనడానికి ఈ రహదారులే ఉదాహరణ. పూర్వం పొలం గట్లే కాడెద్ల బండి దారిగా మారగా.. తర్వాత అవే తారు రోడ్లుగా మారాయి. ఎక్కడా రోడ్డు ఇంజినీరింగ్ కనిపించదు. ఇందుకు ఉదాహరణ (కరీంనగర్ హైవే) రాజీవ్ రహదారే. అంతకు మించి మలుపులు నగరంలో ఉన్నాయి. వాటిని పక్కన పెడితే నగరంలో నిర్మిస్తున్న రహదారులు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో అందరికీ ఎరుకే. వర్షం పడితే రహదారులు నీట మునుగుతున్నాయి. తారు కరిగి కంకర తేలుతున్నాయి. గోతులమయమవుతున్నాయి. ఇవన్నీ ఒకెత్తయితే.. రహదారికి ఇరువైపులా వదిలేసి కొత్తగా తారు రోడ్లు వేస్తున్నారు. దీంతో రహదారికి ఇరువైపులా కాలువలు తయారవుతున్నాయి. ఇప్పుడివి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.

ఇరువైపులా కాలువలు..

ఎక్కడో బస్తీలో కాదు.. నిత్యం లక్షలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారుల నిర్మాణంలోనూ బల్దియా బాధ్యతగా వ్యవహరించడంలేదు. ముఖ్యమంత్రి నుంచి మంత్రులు నిత్యం తిరిగే రహదారుల నిర్మాణంలోనూ అదే నిర్లక్ష్యం వహిస్తోంది. కాంట్రాక్టరుకు పనులప్పజెప్పి.. కాలు కదపని అధికారగణం తీరుకు నగరంలోని అనేక రహదారుల దుస్థితే నిదర్శనం. మరి బల్దియా కొలతల్లో మాయాజాలమో.. లేక గుత్తేదారుడి కక్కుర్తో తెలియదుగాని.. రోడ్డుకు ఇరువైపులా రెండడుగుల వెడల్పులో తారు రోడ్డు వేయకుండా వదిలేశారు. ఇలా ఒకసారి కాదు.. ప్రతిసారి చేయడంతో ఇప్పుడు అడుగు నుంచి రెండు అడుగుల ఎత్తు తేడా వచ్చింది. ఇప్పుడవి కాలువల్లా మారాయి. వర్షపు నీరు వెళ్లడానికి ఇలా చేశారు అనుకుంటే కాస్త ఎత్తు తగ్గించాలి కాని.. ఇక్కడ కేవలం తారు రోడ్డు వెడల్పులో తేడా రూ.లక్షలు, రూ.కోట్లు మిగిల్చుకునే యావే కనిపిస్తోంది.

ఎస్పీ రోడ్డు..

బేగంపేట నుంచి పరేడ్ మైదానం వరకు ఉన్న సికింద్రాబాద్ వెళ్లే మార్గం. ప్యాట్నీ, ప్యారడైజ్ చౌరస్తాల పరిసరాల్లో వంతెనకు ఆనుకుని వదిలేసిన రహదారి నిర్మాణాన్ని పరిశీలించండి. రెండడుగుల లోతు కనిపిస్తుంది. మెట్రో నిర్మాణ పనులతో కుంచించుకుపోయిన ఈ రహదారిలో.. లక్షలాది వాహనాలు నిత్యం పరుగులు పెడుతుంటాయి. ఉప్పల్, ఎల్బీనగర్, నాగోల్ నుంచి ఐటీ సంస్థలు కొలువైన సైబరాబాద్‌కు వాహనాలు బారులు తీరుతాయి. ఈ రోడ్డులో రోడ్డు మీద రోడ్డు వేస్తున్నారు. కానీ ఇరువైపులా మాత్రం అలాగే వదిలేస్తున్నారు. దీంతో ఒక్కో దగ్గర మోకాలు లోతు కాలువల్లా ప్రధాన రహదారి మారింది. పొరపాటున వాహనాలు పక్కకు జరిగితే వంతెనను ఢీకొని ఇరుక్కోవాల్సిందే.

ట్యాంక్‌బండ్ దారి..

ట్యాంక్‌బండ్‌పై ఇటీవల మళ్లీ తారు రోడ్డు నిర్మించారు. రెండువైపులా వదిలేశారు. దూసుకుపోతున్న వాహనాలు ఏమాత్రం పక్కకు జరిగినా.. అడుగు నుంచి రెండడుగుల లోతులోకి చక్రాలు దిగుతాయి. ఏమాత్రం వేగం ఉన్నా.. ఆ ప్రమాదాన్ని ఊహించలేం. వేలాది మంది పర్యాటకులు ట్యాంక్‌బండ్‌పై నడుస్తూ వెళుంటారు. సాగర్ అందాలను.. ట్యాంక్‌బండ్‌పై కొలువుదీరిన తెలుగు తేజాల విగ్రహాలను చూస్తూ ముందుకు కదులుతారు. ఇలాంటి పరిస్థితుల్లో వాహన ప్రమాదం ఏర్పడితే నష్టాన్ని ఊహిస్తేనే భయమేస్తోంది. మరి బల్దియాకు ఎందుకు పట్టదో.



హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ సమీపంలో..



ఐటీ సంస్థలు కొలువుదీరాయి. సైబర్ టవర్‌తో మొదలై.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అనేక ఐటీ సంస్థలకు నిలయంగా సైబరాబాద్ పరిసరాలు మారాయి. మినీ భారతాన్ని తలపించే విధంగా దేశంలోని అన్ని రాష్ట్రాల వారూ ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. అల్వాల్, సుచిత్ర, జగద్గిరిగుట్ట, మియాపూర్, బాచుపల్లి, నిజాంపేట, కేపీహెచ్‌బీ ఇలా అనేక వందల, వేల కాలనీల్లో ఉంటున్న ఐటీ ఉద్యోగులు వినియోగిస్తున్న రహదారి ఇది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకూ ఈ రహదారుల్లో ట్రాఫిక్‌ను ఊహించలేం. ఇలాంటి మార్గంలో రహదారుల నిర్మాణం ఎలా ఉండాలి అనేది పక్కన పెడితే ఎలా ఉండకూడదో ఉదహరించడానికి నిదర్శనంగా ఉన్నాయి. హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ సమీపంలోని రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలున్నాయి. ఇరుకుగా ఉంటుంది. పక్కనే వరద కాలువలు కింద నుంచి వెళ్తుంటాయి. మనిషి మునిగిపోయేంత లోతున్న కాలువలు ఇరుపక్కలా ఉంటాయి. పొరపాటున వాహనదారుడు అదుపు తప్పాడా.. ప్రమాదాన్ని ఊహించలేం. అక్కడ ఇరుపక్కలా ఇనుప రాడ్లు గతంలో ఉండేవి. వాహనాలు తగిలి ప్రస్తుతం ఏమీ లేకుండా మారాయి. మళ్లీ వాటిని ఏర్పాటు చేయాలనే ధ్యాసే బల్దియాకు లేకుండా పోయింది.

జూబ్లీహిల్స్ నుంచి వెంకటగిరి దారి..

జూబ్లీహిల్స్ చౌరస్తా నుంచి కృష్ణానగర్, శ్రీనగర్ మీదుగా వెళ్లే అనేక వాహనాలు వెంకటగిరి మీదుగా వెళ్తాయి. జూబ్లీహిల్స్ చెక్ పోస్టు నుంచి లోయలోకి దిగిన మాదిరి ఈ రహదారి ఉంటుంది. కొండ నుంచి దిగుతున్న మాదిరి వాహనాలు అదుపుతప్పి మరీ దూసుకొస్తుంటాయి. ఇలాంటి తరుణంలో అత్యంత ప్రమాదకర మలుపు ఉంటుంది. దీనికితోడు ఈ రహదారికి ఎడమవైపు వెంకటగిరికి తిరుగుతున్న తరుణంలో మోకాలు లోతు కాలువ మాదిరి ఉండే గొయ్యి.. వాహనదారులను భయానికి గురి చేస్తుంటుంది. అక్కడ ఫుట్‌పాత్ కూడా లేదు. నడుచుకుంటూ వెళ్తున్నవారి ఆందోళన మాటల్లో చెప్పలేం. ఇంతటి ప్రమాదకరంగా ఈ రోడ్డును ఎలా నిర్మిస్తున్నారు. పక్కనే కాలువలా ఎందుకు వదిలేస్తున్నారనేది ఎవరికీ అర్థం కాదు. ఎప్పుడు రోడ్డు వేసినా ఉన్న దానిపైనే వేస్తున్నారు కాని.. పక్కన గొయ్యి పూడ్చాలనే ధ్యాసే ఉండట్లేదు.



నగరమంతా ఇదే పరిస్థితి...

పైన పేర్కొన్న నాలుగు పరిశీలనా ప్రాంతాలు కేవలం ఉదాహరణలే. నగరంలో ఉన్న రహదారులన్నీ ఇలాంటి దుస్థితిలోనే ఉన్నాయి. రహదారికి ఇరువైపులా కాస్త తక్కువ ఎత్తు ఉంచితే వర్షపు నీరు వెళ్తుందన్న అధికారుల సూచనలు ఇప్పుడు కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నట్టుంది పరిస్థితి. రహదారి నిర్మించినపుడు ఉన్న పాత తారును, కంకరను తొలగించి రోడ్లు వేయాలనే నిబంధనలను ఎప్పుడో గాలికి వదిలేసిన కాంట్రాక్టర్లు ఇప్పుడు రహదారికి ఇరువైపులా రెండు అడుగుల మేర వదిలేసి రోడ్లు వేసేస్తున్నారు. ఈ లోపాలకు తోడు.. ఎక్కడైనా ఎండలు మండితే తారు కరుగుద్ది.. కానీ నగరంలో మాత్రం వర్షం పడితే తారు కదిలిపోతుంది. ఒక్క వర్షానికే నగర రహదారులు కంకర తేలుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత రహదారులు మరింత పటిష్టవంతంగా ఉండాల్సింది పోయి నాణ్యతా లోపంతో వారం కూడా ఉండట్లేదు. గోతుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేలేదు. వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు వేస్తున్న పాయింట్ల మాదిరి ఈ రహదారుల్లో గోతుల విషయంలో అధికారులకు ఎన్ని పాయింట్లు వేయాలి.. జరిమానాలు ఎంత మొత్తంలో విధించాలి.. బాధ్యులుగా ఎంతమందిపై చర్యలు తీసుకోవాలి.. నగరవాసిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ప్రశ్నలు.



హాజరైన వధూవరులు, వారి తల్లిదండ్రులు, బంధువులు

పరిణయానికి దారి చూపే పరిచయ వేదిక

'ఈనాడు–పెళ్లి పందిరి.నెట్' నాయీ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికకు స్పందన



వరుడితోపాటు అతని తల్లిదండ్రులను పరిచయం చేస్తున్న వ్యాఖ్యాత

అమీర్‌పేట, న్యూస్‌టుడే: మంచి పెళ్లి సంబంధాలను వెతుక్కోవాలంటే ఈ రోజుల్లో కొంచెం శ్రమతో కూడుకున్న పని. ఈ కష్టాన్ని సులభతరం చేస్తూ 'ఈనాడు-పెళ్లి పందిరి.నెట్' ఆధ్వర్యంలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన లభించింది. బేగంపేట రైల్వే స్టేషన్ సమీపంలోని 'ఈనాడు' ఈవెంట్స్ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన నాయీ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు ముందుగానే ఎంపికై, తమ పేర్లను నమోదు చేసుకున్న వధూవరులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా హాజరయ్యారు. పరిచయ వేదిక కోసం కేటాయించిన హాల్ నిండిపోయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వ్యాఖ్యాతగా వ్యవహరించిన స్రవంతి వధూవరులను ఒక్కొక్కరిగా పరిచయం చేశారు. వారి పూర్తి వివరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై ప్రదర్శించారు. వధూవరుల వివరాలు పొందుపరచిన సీడీలను అందజేశారు.



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

శిక్షణతో చేతిరాతకు పదును

'ఈనాడు-హాయ్‌బుజ్జీ' ఆధ్వర్యంలో ముగిసిన చేతిరాత శిక్షణ తరగతులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: 'ఈనాడు-హాయ్‌బుజ్జీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేతిరాత అభివృద్ధి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. భాగ్యనగర్‌కాలనీలోని శ్రీగాయత్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. జూన్ 25వ తేదీ నుంచి చేపట్టిన ఈ తరగతుల ముగింపు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. చేతిరాతను అభివృద్ధి చేసుకోవడం, మెలకువలను ఈ శిక్షణలో ఫ్యాకల్టీ చక్కగా వివరించారు. దీంతో చేతిరాత మెరుగైందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి శిక్షణ తరగతులు పిల్లలకు బాగా మేలు చేస్తాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. శిక్షణ ఎంతో ఉపయోగకరంగా సాగిందని వివరించారు. విద్యార్థులకు ఉపయోగకరమైన ఇలాంటి తరగతులు నిర్వహించడం పట్ల 'ఈనాడు'కు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ ముగింపు సందర్భంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు నిర్వాహకులు ధ్రువీకరణపత్రాలను అందజేశారు.

సంపులో పడి ఐదేళ్ల బాలుడి మృతి

బిస్కెట్ తెచ్చుకునేందుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు



బాలుడు అనిరుధ్ (పాతచిత్రం)

బాలాపూర్, న్యూస్‌టుడే: బిస్కెట్ తెచ్చుకుంటానని దుకాణానికి వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జిల్లెలగూడ శక్తినగర్‌లో ఉంటున్న దోమలపల్లి నందం, జ్యోతిలకు ఐదేళ్ల వయసున్న అనిరుధ్ ఉన్నాడు. ఇతను రవీంద్రభారతి పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. శనివారం ఉదయం బిస్కెట్ తెచ్చుకుంటానని బయటకు వెళ్లాడు. కానీ ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో సాయంత్రం మీర్‌పేట పోలీసులను ఆశ్రయించారు. అయితే వారు ఉంటున్న స్థలం ఆవరణలోనే సంపు ఉంది. ఆదివారం ఉదయం దానిని తెరిచి చూడగా బాలుడు అందులో విగతజీవుడై కన్పించాడు. సంపుపైన మూత సరిగ్గా లేకపోవడంతో బాలుడు దుకాణం నుంచి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

అత్యాచార బాధితులకు... సత్వర సాంత్వన



ఈనాడు, హైదరాబాద్

వేగంగా పరిహారం ఇప్పిస్తాం

కలెక్టర్ యోగితా రాణా హామీ

'భరోసా' కార్యక్రమాల్లో సహకరించేందుకు సిద్ధం

అత్యాచార బాధితులకు వేగంగా పరిహారం ఇప్పించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ, రెవెన్యూ శాఖ తరపున కృషి చేస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా పోలీస్ ఉన్నతాధికారులతో అన్నారు. అత్యాచార కేసులు, పోక్సోచట్టం కేసుల్లో బాధితులకు సత్వర సాంత్వన లభించేందుకు తమశాఖ తరపున సహకారం అందిస్తామని వివరించారు. కొత్వాల్ మహేందర్ రెడ్డి నేతృత్వంలో ఇటీవల జరిగిన 'భరోసా' కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ఆమె తొలిసారిగా పాల్గొన్నారు. భరోసా కేంద్రం సేవలను పోలీస్ అధికారుల ద్వారా తెలుసుకున్న అనంతరం తమ పరిధిలో ఉన్న అంశాలకు సంబంధించిన దస్త్రాలు, ఇతర విషయాలను పెండింగ్ లేకుండా చేస్తామన్నారు. కొన్నేళ్ల నుంచి అత్యాచార బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందని విషయాన్ని పోలీసులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా... వీటన్నింటినీ వీలైనంత వేగంగా పరిష్కరిస్తామన్నారు. పోలీసులు, ఫోరెన్సిక్ ప్రయోగశాల నుంచి నివేదికలను అందగానే.. మూడోవంతు పరిహారం అందిస్తామని పోలీస్ అధికారులతో చెప్పారు. ఇకపై అత్యాచార బాధితుల పరిహారం, పోక్సోచట్టాన్ని సంయుక్తంగా పర్యవేక్షిద్దామంటూ అదనపు సీపీ(నేర పరిశోధన) స్వాతి లక్రా కలెక్టర్ యోగితా రాణాకు సూచించారు.

వైద్యారోగ్యశాఖ ద్వారా వైద్యులు, నర్సులు

అత్యాచార బాధితులు, చిన్నారులకు 'భరోసా' కేంద్రంలో వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిరంతరం వైద్యసేవలు అందించేందుకు నలుగురు వైద్యులను వైద్యారోగ్యశాఖ కేటాయించింది. వీరంతా కాల్ ఆన్(పిలుపు వచ్చినప్పుడు మాత్రమే) పద్ధతిలో పని చేస్తుండగా.. కొద్దినెలల నుంచి ఇద్దరు వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇక్కడే ఉండి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి తోడుగా ఒక నర్సు పనిచేస్తున్నారు. వైద్యులు, నర్సులు విధులు ముగించుకుని వెళ్లిపోయాక కొందరు అత్యాచార బాధితులు భరోసా కేంద్రానికి వస్తున్నారు. తక్షణం వైద్య సేవలందించేందుకు వైద్యులు లేకపోవడంతో భరోసా కేంద్రంలో పోలీసులు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు లేదా కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బాధితులను చేర్చుకునేందుకు కార్పొరేటు ఆసుపత్రులు నిరాకరిస్తుండంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ అంశాన్ని పోలీస్ అధికారులు కలెక్టర్ యోగితా రాణా దృష్టికి తీసుకెళ్లగా.. . ఒక నర్సు 24 గంటలూ విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతోపాటు వైద్యులు అందుబాటులో ఉండేలా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో చర్చించి చెబుతామని పోలీస్ అధికారులకు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పేట్లబురుజు ఆసుపత్రిలోని వార్డుల్లో పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే వారినీ రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు.

అవగాహన సదస్సుల్లో 'మెప్మా' బృందాలు

వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లపై 'షి' బృందాలు నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) బృందాలను తీసుకువెళ్లాలని కలెక్టర్ యోగితా రాణా పోలీస్ అధికారులను కోరారు. ప్రస్తుతం 'షి' బృందాలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఈవ్‌టీజింగ్‌ను ఎలా ఎదుర్కోవాలి? పోలీసులకు ఎలా సమాచారం ఇవ్వాలన్న అంశాలపై విద్యార్థినులు, యువతులకు వివరిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళా సంఘాల సమావేశాల్లో పాల్గొంటూ వారికి అవసరమైన సూచనలు సలహాలు ఇస్తున్నారు. ప్రభుత్వం తరపున 'మెప్మా'లో పనిచేస్తున్న యువతులు, మహిళలు క్షేత్రస్థాయిలో పలు మహిళా సంఘాలకు అందుబాటులో ఉంటారని, సమావేశాలను నిర్వహించేందుకు వారు సహకరిస్తారని, ఇదే సమయంలో మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై మహిళా సంఘాలకు వివరిస్తే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని పోలీస్ ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. పైగా మహిళా పొదుపు సంఘాలు, ఇతర సంఘాల్లో సభ్యులుగా ఉండేవారిలో తొంభై శాతం మందికి చరవాణులుంటాయని, వారి ప్రమేయం లేకుండానే పోకిరీలు, ఈవ్‌టీజర్లు వేధిస్తే కుటుంబ సభ్యులకు చెప్పలేక మనోవేదన అనుభవించే బదులు 'షి' బృందాలకు వివరిస్తే వెంటనే సాంత్వన కలిగించే అవకాశాలున్నాయని పోలీస్ అధికారులు వివరించారు. మెప్మాబృందాలు జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తుండటంతో వారితో ఒక సారి సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. మహిళలు, యువతులకు భద్రత కల్పించేందుకు మరిన్ని మెరుగైన సేవలందించాలని తీర్మానించారు.



యాంకరింగ్ శిక్షణ పూర్తి చేసుకుని ధ్రువపత్రాలు అందుకున్న అభ్యర్థులు

శిక్షణార్థులకు ధ్రువపత్రాల పంపిణీ

'ఈనాడు-ఈతరం, హాయ్‌బుజ్జీ' ఆధ్వర్యంలో ఔత్సాహికులకు శిక్షణ పూర్తి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈతరం, హాయ్ బుజ్జీ' ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నిర్వాహకులు ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలోని 'ఈనాడు' ఈవెంట్స్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సందడిగా ఈ కార్యక్రమాలు జరిగాయి. వేదికపై ఎటువంటి జంకు లేకుండా అనర్గళంగా మాట్లాడుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే యాంకర్లకు ఎంతో ఆదరణ ఉంది. 'ఈనాడు-ఈతరం' ఆధ్వర్యంలో 10 ఆదివారాల పాటు నిర్వహించిన యాంకరింగ్‌లో శిక్షణ పొందడం కోసం నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులైన యువతీ యువకులతో పాటు చిన్నారులు కూడా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకుని నిష్ణాతులగా మారిన వారు తమ ప్రతిభాపాటవాలను చివరిరోజు వేదికపై ప్రదర్శించారు. వీరికి 'ఈనాడు' ఈవెంట్స్ సీనియర్ మేనేజర్ సాధనతో పాటు నిపుణులు వేమూరి రోహిణి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి 'ఈనాడు' ఈవెంట్స్ తెలంగాణ రాష్ట్ర యూనిట్ మేనేజర్ కౌశిక్‌రామ్ హాజరయ్యారు.

● 'ఈనాడు-హాయ్‌బుజ్జీ' ఆధ్వర్యంలో వేదిక్ మ్యాథ్స్, డ్రాయింగ్, చేతిరాత అంశాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాలను ప్రదానం చేశారు. వేదిక్ మ్యాథ్స్ నిపుణులు నీతా సక్సేనా, డ్రాయింగ్ నిపుణులు మ్యాథ్యూ, చేతిరాత నిపుణులు సునీల్ ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ చిన్నారుల్లో ఉన్న సృజనను, ప్రతిభా పాటవాలను వెలికి తీయడం కోసం ప్రతీ ఆదివారం నిర్వహించిన కార్యక్రమాలకు స్పందన లభించిందన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టేందుకు మద్దతివ్వాలి

● భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌కు బీసీ సంఘాల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పలు బీసీ సంఘాలు భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌కు విన్నవించాయి. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేశ్, తెలంగాణ బీసీ యువజన సంఘం అధ్యక్షులు నీల వెంకటేశ్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నర్సింహగౌడ్ తదితరుల బృందం రాంమాధవ్‌కు వినతిపత్రం సమర్పించింది. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం కూడా దాటడం లేదని, దీని వల్ల దేశంలో 56 శాతం ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. అదే విధంగా స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు.

సమానత కోసం టీమాస్ ఏర్పాటు: తమ్మినేని



తమ్మినేని వీరభద్రం

మాదన్నపేట, న్యూస్‌టుడే: సామాజిక,రాజకీయ, ఆర్థిక సమానతల కోసం తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్య వేదిక (టీమాస్) ఏర్పాటైందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. హైదరాబాద్ సౌత్ జిల్లా టీమాస్ ఆవిర్భావ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పలు సామాజిక సంఘాలకు న్యాయం జరగడంలేదని, ప్రస్తుతం టీమాస్ ఏర్పాటు ద్వారా ఐక్యంగా పోరాటాలు సాగించేందుకు ఆస్కారమున్నట్లు తెలిపారు. మరో అతిథి ప్రొ.కంచె ఐలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు రేపుతోందన్నారు. పాతనగరంలో పరిస్థితి దారుణంగా ఉందని విమలక్క తెలిపారు. మాదన్నపేట పారామౌంట్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులే.. దేశాల ప్రతినిధులుగా.!







విద్యార్థులు నిర్వహించే నమూనా ఐక్యరాజ్య సమితి సమావేశాలు ఆదివారం ముగిశాయి. దేశవ్యాప్తంగా 26 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఆయా దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తూ అక్కడి సమస్యలను ప్రస్తావించారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్(విద్యాశ్రమం)లో రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సుకు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రూపొందించిన నివేదికను ఐరాసకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను విద్యాశ్రమం ప్రిన్సిపల్ అభినందించి, ధ్రువపత్రాలు అందించారు.

– న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

ఇయర్‌ఫోన్ తీయబోయి.. విద్యుదాఘాతంతో యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు



రవీందర్ మృతదేహం

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: చెట్టు కొమ్మలపై పడ్డ చరవాణికి సంబంధించిన ఇయర్‌ఫోన్ ఇనుపరాడ్‌తో తీయబోయి విద్యుదాఘాతంతో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. అతడ్ని కాపాడడానికి ప్రయత్నించిన మరో ఇద్దరు యువకులు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై జయరాం కథనం ప్రకారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మునిగేపల్లికి చెందిన రవీందర్, పవన్‌కుమార్, సతీష్, మురళి, మన్మథరావులు ఎంబీఏ పూర్తి చేశారు. ఇటీవల దిల్‌సుఖ్‌నగర్ గౌతంనగర్‌లో ఓ ఇంట్లో రెండో అంతస్తులో గది అద్దెకు తీసుకుని పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఆదివారం పవన్‌కుమార్ బయటకు వెళ్తూ తన చరవాణికి సంబంధించిన ఇయర్‌ఫోన్లు మర్చి పోయి కిందకు దిగాడు. గదిలో ఉన్న స్నేహితులను పిలిచి ఇయర్‌ఫోన్లు కిందకు వేయమన్నాడు. వారి కిందకు విసరగా చెట్టుకొమ్మలపై పడింది. రవీందర్ ఇనుప రాడ్‌ను తీసుకువచ్చి ఇయర్‌ఫోన్ తీస్తుండగా అది అక్కడే ఉన్న హైటెన్షన్ విద్యుత్తు తీగలకు తగలడంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. అతడ్ని కాపాడడానికి యత్నించిన మురళి, మన్మథరావులకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మన్మథరావు పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.